
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 19.06.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

- ఆందోళనలో తెలుగు నేతలు
- పకడ్బందీగా కట్టడి చేస్తున్న కేసీఆర్
- బాబు రాజీనామాపై సస్పెన్స్
- గవర్నర్‌పై బురద చల్లే ప్రయత్నం
- ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య చిచ్చుకు శ్రీకారం
- ప్రేక్షకపాత్రకు అంకితమైన కేంద్రప్రభుత్వం




# కాసుల కేసు

**చంద్రబాబుకు మనశ్శాంతి లేకుండా చేయడానికే తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చినట్లున్నాయి. ఆయనను దోషిగా బోనులో నిలబెట్టడానికే ఈ ఎన్నికలను పెట్టినట్లుంది. ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోయి ఎవరివి వాళ్లు గెలుచుకునిపోయారు. చంద్రబాబుకు ఏమీ రాకపోయినా చివరికి దాని బురద మిగిలింది. దాన్ని కడుక్కోవడానికే ఆయన అవస్థలు పడుతున్నాడు.**

ఓటు – నోటు కేసు క్లైమాక్స్‌కు చేరినట్లే కనిపిస్తోంది. ఈ కేసుకు సంబంధించి మొదట్లోనే రెడ్ హ్యాండెడ్‌గా ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. ఆయన జైలులోనే వున్నాడు. తెలంగాణలో తెలుగుదేశాన్ని ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టాలనుకున్న కేసీఆర్‌కు ఈ కేసు ఒక ఆయుధంలా దొరికింది. రేవంత్‌రెడ్డి వద్ద దొరికిన తాడును పట్టుకుని మూలాల్లోకి పోయారు. చంద్రబాబుతో పాటు తెలుగుదేశం కోటరీని ఈ కేసులో ఇరికించే విధంగా ఆధారాలు సేకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ కేసు విషయంలో చాలా లోతుగా వెళ్లడమేకాక జాగ్రత్తగా వ్యవహరించింది. ఆదరాబదరా నోటీసులు ఇవ్వడం, అరెస్ట్‌లు చేయడం వంటివాటి జోలికి పోకుండా అన్ని ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టడం, కోర్టు ఆదేశాలతో నిందితులకు నోటీసులు జారీ చేయడం జరిగింది. కోర్టు అనుమతితోనే అరెస్ట్‌లు కూడా జరిగే అవకాశాలున్నాయి.

ఓటు–నోటు కేసులో సాంకేతిక విజ్ఞానాన్ని తెలంగాణ ప్రభుత్వం బాగా వాడుకుంది. సెల్‌ఫోన్ కాల్స్, సెల్‌టవర్స్ పరిధిని బాగా ఉపయోగించుకున్నారు. రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపీలు సిఎం రమేష్, గరికపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే సండ్ర వీరయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి వేం నరేంద్రరెడ్డిలతో సహా డబ్బు సమకూర్చిన ఇతరులు అందరూ కలిపి

(మిగతా 11వ పేజీలో)



ఈ నెల 18న హైదరాబాద్ శాసనమండలిలో మండలి ఛైర్మెన్ చక్రపాణి, డిప్యూటీ సీఎం కె.ఇ.కృష్ణమూర్తిల సమక్షంలో ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర

# మండలిలోకి ఆ ఇద్దరు

నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో ముఖ్యనాయకుడు, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలబడిన రాజకీయ బలశాలి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి... అలాగే జిల్లా పార్టీలో బలహీన వర్గాల నుండి బలమైన నాయకుడు, ఏ పదవినిచ్చినా ఒడుపుగా నెట్టుకొచ్చే యువశక్తిశాలి బీద రవిచంద్రలు ఈ నెల 18న శాసన మండలిలో అడుగుపెట్టారు. ఎమ్మెల్సీలుగా ఇద్దరి చేత మండలి ఛైర్మెన్ చక్రపాణి ప్రమాణస్వీకారం చేయించారు.

(మిగతా 11వ పేజీలో)

# విద్యుత్‌తోనే బుద్ధి.. అభివృద్ధి



విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ చినజీయర్ స్వామి 3లో

# విజయ లేబోరేటరీకి 30ఏళ్లు



నెల్లూరు, ఏసి అగ్రహారంలో ఉన్న విజయ లేబోరేటరీకి ఈ జిల్లా ప్రజలతో ప్రత్యేక అనుబంధం వుంది. ఈ ల్యాబ్‌కు 30ఏళ్ల చరిత్ర వుంది. నెల్లూరులో వైద్య సదుపాయాలు అంతంత మాత్రంగా వున్న రోజుల్లో అత్యాధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానంతో డాక్టర్ ఎం.పెంచలరెడ్డి ఈ లేబోరేటరీని స్థాపించి 30ఏళ్లుగా జిల్లా వాసులకు రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ తనవంతు సేవలందిస్తున్నారు.

ఈ నెల 16న ఈ లేబోరేటరీ 30వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఫీజు రాయితీతో రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేసారు. పేదరోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఊబకాయులకు ఉచితంగా కౌన్సిలింగ్ కార్యక్రమం ఏర్పాటు చేసారు. తమ లేబోరేటరీ నందు సాధారణ రక్తపరీక్షలతో పాటు థైరాయిడ్, హార్మోన్స్, పాప్‌స్మీర్, ఇఎన్‌ఏసి, క్యాన్సర్ మరియు బయాప్సీ పరీక్షలను నిర్వహిస్తున్నామని డాక్టర్ పెంచలరెడ్డి తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా క్లాసులు నిర్వహిస్తున్నామని, అధికబరువు, లావు తగ్గించుకోవాలనే వారికి 50శాతం ఫీజు రాయితీ వుందని ఆయన వెల్లడించారు.

## పుష్కరాలకు వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది

గోదావరి పుష్కరాలకు నెల్లూరుజిల్లా వెంకటగిరి పట్టణం నుండి 40మంది అగ్నిమాపక సిబ్బంది సేవలు అందించేందుకు వెళుతున్నారని జిల్లా అగ్నిమాపకాధికారి జ్ఞానసుందరం తెలిపారు. మంగళవారం వెంకటగిరి పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ పుష్కరాలకు వెళ్లే 40మందికి తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. వీరికి సహాయకులుగా మరో పదిమంది ఉంటారన్నారు. ఘాట్లలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లాలో సర్వేపల్లి, కోవూరు, రాజుపాళెం, సంగం మండలాల్లో నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం నుండి అనుమతి రాగానే వాటిని ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట అగ్నిమాపకాధికారి కృష్ణారెడ్డి ఉన్నారు.

# జగన్‌వన్నీ చీకటి రాజకీయాలే!

**- దేశం నేతల ధ్వజం**

తెలంగాణలో తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు ప్రతిపక్ష నేత జగన్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో చీకటి ఒప్పందాలు చేసుకున్నారంటూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర తీవ్రంగా ఆరోపించారు. బుధవారం నెల్లూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర ప్రజలకు కెసిఆర్ ఎంతగా అన్యాయం చేస్తున్నా, జగన్ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఇందుకు నిదర్శనమని ఆయన విమర్శించారు. కెసిఆర్ ఎన్ని అక్రమాలు చేస్తున్నా జగన్‌కు కనపడడం లేదా అని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లో సీమాంధ్ర ప్రజలు పడుతున్న కష్టాలు జగన్‌కు కనిపించడం లేదా?..అసలు ఏనాడైనా జగన్ ఆంధ్రుల పక్షాన మాట్లాడారా?..అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు నీటి కష్టాలను తీర్చేందుకు పట్టిసీమ ప్రాజెక్టును చేపడుతుంటే, జగన్ దానిని వ్యతిరేకించడంలో అర్థమేమిటని ఆయన అంటూ, తద్వారా జగన్ ఆ నాలుగు జిల్లాలకు ద్రోహం చేస్తున్నారని ఆయన విమర్శించారు. చీకటి రాజకీయాలు చేస్తున్న జగన్, ఎదుటివారికి నీతులు చెప్పేందుకు ప్రయత్నించడం విచారకరమన్నారు.

ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, నూనె మల్లికార్జునయాదవ్, గంగాధర్, తెలుగుయువత నాయకులు శింగంశెట్టి రవిచంద్ర, జలదంకి సుధాకర్, కిషోర్ పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# డ్వాక్రా రుణాల మాఫీకి రూ.98.60కోట్లు

నెల్లూరుజిల్లాలో డ్వాక్రా రుణాల మాఫీకి ప్రభుత్వం రూ.98.60కోట్లు విడుదల చేసిందని డిఆర్‌డిఏ పి.డి చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు స్త్రీ శక్తి భవన్‌లో జెఎంఎల్ బిసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాఫీ చేసిన సొమ్మును సభ్యులు విత్‌డ్రా చేసుకోకూడదన్నారు. ఖాతాలోనే ఉంచుకుని తదుపరి లావాదేవీలు నిర్వహించుకోవాలన్నారు. రుణమాఫీలో పేర్లు రానివారు ఆధార్, రేషన్‌కార్డులు వారంలోపు సిద్ధం చేసుకోవాలన్నారు. తాము ప్రకటించినప్పుడు వాటిని సంబంధిత అధికారులకు సమర్పించాల్సి వుంటుందన్నారు. లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీలో 2,67,230మంది రైతులకు లబ్ది చేకూరుతుందన్నారు. రెండు విడతల్లో రూ.50వేల వరకు ఉన్న రుణాలు పూర్తిగా మాఫీ అవుతుండగా ఇందుకోసం రూ.964.79కోట్లు, రూ.50వేల నుంచి రూ.1.5లక్షల వరకు 20శాతంగా రూ.372.82కోట్లు ప్రభుత్వం బ్యాంకులకు జమచేసిందన్నారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడీ కోటేశ్వరరావు, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట ఎంపిడివోలు నిర్మలాదేవి, హైజక్ ప్రవీణ్, వెంకట్రావు, వెలుగు ఏసి రత్నమ్మ, ఆయా మండలాల ఏపిఎంలు బుజ్జమ్మ, ప్రసాద్, సిసిలు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు ఆర్టీసీ డిఎంగా అనిల్‌కుమార్

గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వై.అనిల్‌కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. 2011బ్యాచ్‌కి చెందిన ఆయన ఏడాది పాటు శిక్షణ పొంది 2012లో నిజామాబాద్ బాన్సువాడ డిపో మేనేజర్‌గా పని చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల విభజనలో భాగంగా ఆయన్ను గూడూరుకు కేటాయించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. డిపోలో నష్ట నివారణ చర్యలు చేపట్టి డిపోను లాభాల బాటలో నడిపిస్తామన్నారు. ఆయన సతీమణి ప్రస్తుతం వాకాడు డిఎంగా పని చేస్తున్నారు.

# ఫీజులు భారం..చదువులు దూరం

- 'ప్రైవేట్' జోరు...ప్రభుత్వ పాఠశాలల బేజారు
- లోపభూయిష్టమైన విధానాలే వెతలకు కారణమా?..

***స్కూళ్ళు తెరిచారంటే చాలు.. పిల్లల సంగతేలా వున్నా తల్లిదండ్రులకు మాత్రం గుండెల్లో దడ మొదలవుతుంది. ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, యూనిఫారాలు.. ఒకటేమిటి ఇలా ఒకటొకటి వస్తూనే వుంటాయి. అన్నిటి ధరలూ ఆకాశానికి అంటుతుంటే మమ్మీ-డాడీలు వాటిని సమకూర్చడానికి పడే అవస్థలు అన్నిన్ని కావు. అందులోనూ ప్రైవేట్ పాఠశాలల్లో, లేదా కార్పొరేట్ స్థాయి స్కూళ్లలోనో తమ పిల్లలను చదివించుకోవాలని ఆశపడే మధ్యతరగతి ప్రజలకు నిత్యం ఆర్థిక నరకమే.***

ప్రైవేట్ బడుల్లో చదువుల 'ధరలు' గగనానికి అంటుతుంటే, విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ బిడ్డలను ఆ స్కూళ్లలో చదివించుకోవాల్సివస్తోంది. జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థలు దాదాపు 700కు పైగానే వున్నాయి. ఏడాదికేడాదీ వాటి సంఖ్య కొండవీటి చాంతాడులా పెరిగిపోతోనే వుంది. కానీ, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెరిగేది ఎటూ లేకపోయినా, వున్న పాఠశాలలు అస్తవ్యస్తంగా మారడమో, లేక అతితక్కువ విద్యార్థులతో నామమాత్రంగా నడుపుకోవడమో జరుగుతోంది. ప్రైవేట్ వారు ప్రతి చిన్న విషయంపై శ్రద్ధ చూపుతూ, తమ స్కూళ్ళ నిర్వహణ కోసమంటూ వేలకు వేలు ఫీజులు గుంజుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కరువై ఇక్కడ చదువులు చతికిలబడిపోతున్నా జిల్లా ఉన్నతాధికారులెవరికీ పట్టడం లేదనీ సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతూనే వున్నాయి. వాస్తవానికి విద్యా హక్కు చట్టం అనేది ఒకటున్నా దాని గురించి ఆలోచించేవారూ, అమలు చేసేవారూ అసలే లేరు. దీంతో 'ప్రైవేట్' స్కూళ్లదే ఇష్టారాజ్యమైపోయింది. ఫీజులనీ, డొనేషన్లనీ ఎక్కడ సందు దొరికితే అక్కడంతా డబ్బు గుంజుకోవడమే కొన్ని ప్రైవేట్ స్కూళ్ల వ్యాపారంగా మారింది. మరోవైపు అనేకప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి మరింత ఘోరంగా వుంటోంది. అక్కడ వసతులు సక్రమంగా లేకపోవడం, ఎప్పుడు నెత్తిమీద పడతాయో తెలియని శిథిలావస్థలో వున్న పాఠశాలల్లోనే చదువులు చెప్పుండడం, మరికొన్ని చోట్ల సరైన అయ్యోర్లు లేక.. బోధన నామమాత్రంగానే వుండడం, మొత్తంగా విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు ఎలా నడుస్తున్నాయో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొరవడడం తదితర కారణాలతో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. ఇదే అదనుగా ప్రైవేట్ పాఠశాలలు కార్పొరేట్ అవతారమెత్తి తల్లిదండ్రులను వీరబాదుడు బాదుతున్నాయి.



గడిచిన కొద్ది సంవత్సరాలుగా పరిశీలించినా, జిల్లాలో నానాటికీ ప్రైవేట్ పాఠశాలలు పెరిగిపోతూనే వుండడం, ప్రభుత్వ పాఠశాలలు కొత్తవంటూ నెలకొల్పకపోతుండడం గమనించవచ్చు. ఏడాదికేడాది జనాభా భారీగా పెరిగిపోతున్నా, గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్య పట్ల ఆసక్తి బాగా పెరుగుతున్నా, విద్య అందరికీ అందుబాటులో వుండే విధంగా అటు పట్టణాల్లో కానీ, ఇటు పల్లెల్లో కానీ కొత్త పాఠశాలల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో, అనేకమంది విద్యార్థులకు ఇక తమకు అందుబాటులో వుండే ప్రైవేట్ పాఠశాలలే దిక్కవుతున్నాయి. మండల స్థాయిల్లోనూ, గ్రామస్థాయిల్లోనూ విద్యావసరాలను బట్టి ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త పాఠశాలలను నెలకొల్పి వుంటే, ఇప్పుడింతగా ప్రైవేట్‌పై ప్రజలకు మోజు పెరిగేదే కాదేమో!. దీంతో, ప్రభుత్వ పాఠశాలల కన్నా, మమ్మీ-డాడీ చదువులే మంచివనే భ్రమలో పడి, ప్రైవేట్ పాఠశాలలవైపు ఆకర్షితులవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు హంగులు ఆర్భాటాలతో, భారీ ప్రచారాల హోరుతో బోర్డులు తెరుస్తుండడంతో అనేకమంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, చివరికి ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు సైతం ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతుండడంతో, ప్రభుత్వం కంటే ప్రైవేట్ విద్యాసంస్థలే ఎంతో మెరుగైనవనే అభిప్రాయం సర్వత్రా కలుగుతోంది. ఈ నమ్మకంతోనే అనేక మంది పెద్దమొత్తాల్లో ఫీజులు, డొనేషన్లు సైతం చెల్లించడానికి కూడా వెనుకాడకపోతుండడం ఆ పాఠశాలలకు కలిసి వచ్చిన అదృష్టమైంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ స్థాయి స్కూళ్లలో తమ బిడ్డలు చదవడాన్ని ఒక ప్రతిష్ఠగా కూడా భావించే తల్లిదండ్రులూ లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలల సక్రమ నిర్వహణ కోసం ప్రభుత్వం ఎన్నో నిబంధనలు పెట్టి వున్నా, వాటిని అమలుచేసే విషయంలో అధికారులకు, సిబ్బందికీ చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలంటేనే అంతా అబందరగా వుంటాయనే భావన ప్రజల్లోకి వచ్చేసింది. దీంతో ప్రైవేట్ పాఠశాలల జోరు బాగా పెరుగుతోంది.. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఉత్సాహం తరుగుతోంది. ఇకనైనా ఈ పరిస్థితి మారాలి. ప్రభుత్వపాఠశాలలపై వున్న అపోహలు పోవాలి. తక్కువ వ్యయంతో, నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునేందుకు అందరూ కృషి చేయాలి. ప్రభుత్వం, ఉపాధ్యాయవర్గాలు, పాఠశాలల కమిటీలు, తల్లిదండ్రులు అందరూ కలసికట్టుగా ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను భారీగా పెంచేందుకు, ఉత్తీర్ణత శాతాన్ని బాగా పెంచేందుకు కృషిచేయాలి. ఎంత వ్యయమైనా సరే, అందరికీ అందుబాటులో వుండేలా అవసరమైన ప్రాంతాల్లో కొత్త పాఠశాలలను నెలకొల్పాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దుకుని, క్రమశిక్షణకు మారుపేరుగా పాఠశాలలను తీర్చిదిద్దుకోవాలి. లోప భూయిష్టమైన విధానాలన్నిటికీ స్వస్తి చెప్పాలి. ప్రభుత్వ పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకం కాకుండా, అందరూ కలిసి ఒక పటిష్టవంతమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని చిత్తశుద్ధితో అమలు చేయాల్సి వుంది. లేకుంటే, భవిష్యత్తులో ప్రైవేట్ విద్యే అసలైన విద్యగా, ప్రభుత్వ విద్య మాత్రం ఒక మిథ్యగా మారే ప్రమాదం ఎంతైనా వుంది.

# విద్యతోనే బుద్ధి.. అభివృద్ధి

**- చినజీయర్‌స్వామి**

## వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కొలువుదీరిన "శ్రీవారు"









చదువే అన్నిటికీ మూలమని, మానసిక వికాసం కలిగి పరిపక్వత కలిగిన వ్యక్తిగా మనిషి జీవితంలో ఘన విజయాలను సాధించడానికి మంచి సాధనం "విద్యే" అని జీయర్ స్వామి తమ సందేశంలో పేర్కొన్నారు.

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకులు త్రిదండి చినజీయర్‌స్వామి పాల్గొని స్వామివారి భక్తులనుద్దేశించి ఉపదేశించారు.

జూన్ 12వ తేది శుక్రవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణలతో విపిఆర్ ప్రాంగణం దద్ధరిల్లుతుండగా విపిఆర్ దంపతులు స్వామివారి విగ్రహప్రతిష్ఠ చేసి కలశాభిషేకం గావించారు.

సాయంత్రం 4గంటల నుండి రాత్రి 9గంటల వరకు జరిగిన భక్తిపూర్వక కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి భక్తులు, చినజీయర్ వారి అనుయాయులు విశేషంగా పాల్గొన్నారు.

సుమారు నాలుగున్నర గంటల ప్రాంతంలో విపిఆర్ ప్రాంగణానికి విచ్చేసిన చినజీయర్‌స్వామి నేరుగా నూతన ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహించి కలశాన్ని తమ అమృతహస్తాలతో అభిషేకించి కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేదికపై నుండి దాదాపు గంటన్నర సేపు భక్తులనుద్దేశించి ఉపదేశించారు.

అక్షరాస్యత ప్రాముఖ్యాన్ని ఆయన తన సందేశంలో తెలియజేస్తూ మేధావంతులైన విద్యావంతులుగా సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజ అభివృద్ధికి దోహద పడగలిగిన నాడే మానవుడి జీవితానికి నిజమైన సార్ధకత అన్నారు.

"విపిఆర్ విద్య" అనే సంస్థను త్వరలోనే స్థాపించి తమ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా పేదవారికి మేధోవంతులైన అర్హులకి ఉచితంగా విద్యనందించాలన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పాన్ని జీయర్‌స్వామి అభినందించారు.

కులాలెన్నైనా, మతాలెన్నైనా, వర్గాలెన్నైనా, వర్ణాలెన్నైనా ఈ సృష్టిని శాసించేది భగవంతుడొక్కడేనని, ఎవరెవరి నమ్మకాన్ని బట్టి వారు ఆ దైవాన్ని ప్రార్ధిస్తున్నారని, భగవంతుడు నేరుగా ఎవరికీ కనిపించడని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి సేవాతత్పరుల ద్వారా సమాజసేవకు అవతరిస్తాడని, వారి లాంటి వ్యక్తుల ద్వారా తమ అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడని అన్నారు.

సమాజంలో అందరూ సమానమేనని, దైవం సైతం చిన్నవాళ్లకు అందరికంటే చిన్నవాడిగా పెద్దవాళ్ళకు అందరికంటే పెద్దవాడిగా కనిపిస్తాడని, ఈ సృష్టిని సృష్టించిన వాడే నడిపిస్తాడని ఎవరూ దానికి అతీతం కాదని అన్నారు.



పెద్దల్ని గౌరవించడం, దైవాన్ని ప్రార్ధించడం వంటి చర్యల ద్వారా సమాజంలో మంచిని మానవత్వాన్ని తద్వారా శాంతిని సంతోషాన్ని పెంపొందించడానికి మానవుడే మార్గదర్శకం కావాలని పిలుపునిచ్చారు. సందేశాత్మక సూచనలతో మధ్య మధ్యలో పిట్టకథలు చెప్తూ భక్తులను ఆకట్టుకుంటూ తన ఉపదేశాన్ని గంటన్నర పాటు కొనసాగించారు.

అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ స్వయంగా ఆయన చేతులమీదుగా ప్రసాదాన్ని అందించి ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మాజీఉపాధ్యక్షుడు వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామివారికీ తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని, గతంలో అన్నమయ్య విగ్రహ ఆవిష్కరణతో పాటు నేడు జరిగిన కార్యక్రమంలో స్వామివారిని పాల్గొనవలసిందిగా ఆహ్వానించినప్పుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆయన ఆకర్షితుడై ఎంతో శ్రమతో ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేశారని, సమాజసేవ చేసే వారంటే జీయర్‌స్వామికి ఎనలేని ప్రేమ అని, దేవుడే పంపించిన ప్రతినిధులుగా వారిని స్వామివారు భావిస్తారని చెప్పారు.

స్వామివారి ప్రవచనం అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు, జీయర్‌స్వామి వారి అనుయాయులు పాల్గొని తీర్ధప్రసాదాలు స్వీకరించారు.

వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



విడవలూరు మండలంలోని రామతీర్థం గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షీదేవీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి కన్నుల పండువగా రథోత్సవాన్ని, సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. వేదమంత్రాల మధ్య, మంగళవాయిద్యాల మధ్య, పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తజనసందోహం మధ్య స్వామివార్ల పెళ్ళి వేడుక ఎంతో వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గజవాహనోత్సవం జరిగింది. ఈ వేడుకలో టిడిపి మండలాధ్యక్షుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, విడవలూరు జడ్పీటిసి సభ్యురాలు రమాదేవి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, కోవూరు సిఐ అశోక్‌వర్ధన్, అర్చకులు శ్రీకాంత్‌శర్మ, ఆలయ ఇఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మయ్య కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్

Affiliated to JNT University, Anantapur and Approved by AICTE, New Delhi

ఎన్‌హెచ్-5, నార్తురాజుపాళెం, కొడవలూరు మండలం, నెల్లూరు జిల్లా

సెల్ : 7207207072, 9642346686, 9963188292 ఫ్యాక్స్ : 08622-215218

Courses Offered :


B.TECH: CIVIL - 60, MECH - 60, ECE - 180, EEE - 120, CSE - 60

M.TECH: M.TECH (POWER ELECTRONICS), M.TECH (MACHINE DESIGN), M.TECH (COMPUTER SCIENCE ENGINEERING)

M.B.A: MBA - 180

Diploma Courses: CIVIL - 60, MECH - 60

- జిల్లాలోనే ప్రప్రథమంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన గదులలో విద్యాబోధన
- అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా బోధన
- చాప్టర్‌వైజ్‌గా జెఎన్‌టియూ తరహాలో పరీక్షల నిర్వహణ
- అత్యాధునిక వసతులతో విశాలమైన ల్యాబొరేటరీ సౌకర్యం
- 24 గంటల డిజిటల్ లైబ్రరీ సదుపాయం
- విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం
- రుచికరమైన భోజనం కలిగిన మెస్ సదుపాయం
- 24 గంటలు మినరల్ వాటర్ సౌకర్యం
- జిల్లా నలుమూలల నుండి బస్సు సౌకర్యం
- అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య చికిత్స
- అద్భుతమైన ఉపాధి అవకాశాలు
- వైఫై ఇంటర్నెట్ సౌకర్యం
- సువిశాలమైన క్రీడా ప్రాంగణం



G.BRAHMAIAH
Chairman& President

- ఇంటర్‌లో 900 పైన మార్కులు వచ్చి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కలిగిన విద్యార్థులకు బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 4 సం॥లు హాస్టల్‌లో ఉచిత భోజన సదుపాయం కలదు.
- హాస్టల్‌లో చేరకుండా ఇంటి వద్ద నుండి వచ్చు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
- ఎంసెట్‌లో ర్యాంకు వచ్చిన విద్యార్థులకు (ఫీజు రీఎంబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులు) ఏవిధమైన ఫీజులు లేవు. నేరుగా వచ్చి కాలేజిలో చేరవచ్చును.
- హాస్టలో ఉండు విద్యార్థులకు సంవత్సరానికి 25000/- రూపాయలు మాత్రమే
- మొదటి సం॥ విద్యార్థులకు, బస్సు తిరుగు రూట్లలో ఎక్కడనుండైనా సం॥ రూ.6000/-లు మాత్రమే.
- మేనేజ్‌మెంట్ విద్యార్థులు నేరుగా సంప్రదించి తగిన రాయితీలు పొందవచ్చును.



Dr.K.Subrahmanyam
M.Tech., P.hd
PRINCIPAL
Brahmiah College Of Engg.

PGECET CODE : BCEN 1

EAMCET/ECET/ICET/POLYCET CODE : BCEN



# 'ప్రభా'తం

విధి బలీయమైనది. మృత్యువు మరెంతో కఠినమైనది. ఎన్నెన్నో కుటుంబాలవారిని తీర్థయాత్రలకు హాయిగా తీసుకువెళ్ళిన వ్యక్తి, చివరకు తన కుటుంబసభ్యులందరినీ యాత్రకు తీసుకువెళ్ళి వస్తూ, మార్గమధ్యంలో జరిగిన ప్రమాదంలో మృత్యువు పాలవడం.. ఆయనతో పాటు, ఆ వాహనంలో ఆదమరచి నిద్రపోతున్న ఆయన కుటుంబసభ్యులు కూడా ప్రాణాలు కోల్పోవడం ఎంతో దారుణం. ఒకే ఒక్క బాలుడు మినహా, ఒకే కుటుంబంలో ఒకేసారి 22 మంది విగతజీవులు కావడం, తీర్థయాత్రకు వెళ్ళిన ఆ కుటుంబసభ్యులందరికీ అదే అంతిమయాత్రగా మిగలడం బాధాకరం..అత్యంత విషాదకరం. ఈ దుర్ఘటన రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలచివేసింది. విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం శివారులో వున్న మోసయ్యపేట ప్రాంతానికి చెందిన 23 మంది ఒకే కుటుంబసభ్యులు 'తుఫాన్' అనే వాహనంలో తీర్థయాత్రలకు బయలుదేరారు. దాదాపు వెయ్యి కుటుంబాలను యాత్రలకు తీసుకువెళ్ళిన ఈగల అప్పారావు, అదే ఉపాధిగా మార్చుకున్నాడు. ప్రతి ఏటా తన కుటుంబసభ్యులను కూడా యాత్రలకు తీసుకువెళ్ళడం ఆయనకు అలవాటనీ, తనకున్న అనుభవంతో ఎంతదూరమైనా వాహనాన్ని తాను నడపగలననే ధీమాతో ఇప్పుడు కూడా తన కుటుంబ సభ్యులందరినీ ఉత్సాహంగా యాత్రలకు తీసుకు వెళ్ళాడనీ తెలుస్తోంది. పలు పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న తర్వాత, వాహనంలో తిరుగుముఖం పట్టారు. అయితే, దురదృష్టం వెంటాడినట్లుంది. వాహనం నడుపుతూ అలసిపోయిన అప్పారావుకు నిద్ర ముంచుకురావడంతో వాహనం ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో వాహనం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద అదుపుతప్పి, 50 అడుగుల లోతులో పడిపోయింది. అంతే, అందరూ అందరూ ఆర్తనాదాలు చేస్తూ మృత్యుకోరలకు బలైపోయారు. ఈ నెల 13వ తేదీ వేకువన చిమ్మచీకట్లో ఈ ఘోరం జరిగిపోయింది. పలు పుణ్య క్షేత్రాలను సందర్శించుకుని ఆనందంగా ఇళ్ళకు తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో వంతెన మలుపు వద్ద పొంచి వున్న మృత్యువుకు కన్నుకుట్టింది. వికటాట్టహాసం చేస్తూ వారందరినీ పొట్టనబెట్టుకుంది. ఈ ఘోర ప్రమాదంలో అప్పారావుతో పాటు, ఆయన భార్య, ముగ్గురు కుమారులు, ముగ్గురు కోడళ్ళు, కుమార్తె, అల్లుడు, అత్త, పిన్ని, ఇద్దరు మరదళ్ళు, ఎనిమిదిమంది మనుమలు-మనవరాండ్రు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం మొత్తం మృత్యుఒడిలోకి చేరిపోయినట్లయింది. ఈ ప్రమాదంలో అప్పారావు కుటుంబసభ్యులకు చెందిన ఒకే ఒక్క బాలుడు కిరణ్ కొద్దిపాటి గాయాలతో బతికి, మృత్యుంజయుడుగా మిగిలినా, కన్న తల్లిదండ్రులను, సోదరినీ కోల్పోయిన ఎనిమిదేళ్ళ కిరణ్..అభంశుభం తెలియని ఈ పసివయసులో అందరినీ పోగొట్టుకుని గాయాలతో ఏకాకిగా మిగిలిపోయాడు. అప్పారావు వృద్ధుడైన తన తండ్రిని కూడా ఈ యాత్రకు తీసుకువెళ్ళాలని భావించినా, అప్పటికే 12 మంది పట్టే ఆ వాహనంలో 23 మంది వున్నారు కనుక, తన తండ్రిని మరోసారి తీసుకువెళ్లానని హామీ ఇచ్చి మరీ వెళ్ళినట్లు తెలుస్తోంది. ఆయన కూడా వెళ్ళి వుంటే పరిస్థితి ఏమై వుండేదో ఏమో?.. ఇప్పుడా తండ్రి కుటుంబసభ్యులందరినీ కోల్పోయి..ఈ పెను విషాదంలో నోటమాట రాక శోకసముద్రంలో మునిగిపోయాడు. కన్నబిడ్డని, కుటుంబసభ్యులనీ..అందరినీ పోగొట్టుకున్న ఆ తండ్రి వేదనారోదనలు వర్ణనాతీతం. అందరూ ఒకే కుటుంబసభ్యులైనప్పటికీ, ఈ ప్రమాదంలో మొత్తం 8 కుటుంబాలవారు కలసి వున్నారు. వారంతా చనిపోగా, ఒక కుటుంబంలోని కిరణ్ అనే బాలుడు మాత్రమే బతికి బయటపడ్డాడు. ఇది..ఆ విధి చేసిన వింతే అనుకోవాలేమో!. ఒకే కుటుంబసభ్యులందరూ ఒక్కసారిగా ఇలా ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం!.. చీకట్లో వేగంగా వెళ్తున్న వాహనం ఒక్కసారిగా బ్యారేజీ రెయిలింగ్‌ను ఢీకొని 50 అడుగుల లోతులో పడిపోవడం, ఆ వాహనం అంత లోతులో పడిపోయిన విషయం తెల్లారిందాకా ఎవరికీ తెలియక పోవడం.. అంతా దురదృష్టమే. ఈ దుర్ఘటనలో 22 మంది మరణించడం దారుణం.. దయనీయం!.. మృతుల్లో తొమ్మిది మంది స్త్రీలు, ఆరుగురు పురుషులు, ఏడుగురు చిన్నారులు వున్నారు. ఇలాంటి ప్రమాదం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమం. అయితే, ఘోరప్రమాదం జరిగిపోయాక ఎంత విచారించినా, ఎన్ని విశ్లేషణలు చేసినా, పోయినోళ్ళు మళ్ళీ తిరిగి వస్తారా?.. అయినా, 12మంది ఎక్కాల్సిన వాహనంలో 23 మందిని ఎక్కించు కోవడం నిబంధనలకు విరుద్ధమని ఇప్పుడనుకోవచ్చు కానీ, కనీసం అంతమంది ఒకే వాహనంలో వెళ్ళడం మంచిది కాదని ఏ ఒక్కరైనా వారికి చెప్పారా?. యాత్రల్లో వారెంతో దూరం ప్రయాణం చేసివుంటారు కదా.. ఏ అధికారైనా ఆ వాహనాన్ని పరిశీలించి ఇంతమంది ఒకే వాహనంలో వెళ్ళకూడదని అడ్డు తగిలారా?.. నిద్రమత్తులో వాహనం ప్రమాదానికి గురై వుండవచ్చు గాక, బ్యారేజీల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఏపాటి చర్యలు తీసుకున్నాం? సాధారణంగా వంతెనలవద్ద, రోడ్డు మలుపుల వద్ద మృత్యువు పొంచివుంటుందని ఎన్నో సంఘటనల్లో తెలుస్తూనే వుందికదా.. అలాంటి ప్రమాదాలు మళ్ళీ మళ్ళీ జరుగకుండా ఎలాంటి ముందుజాగ్రత్తలు తీసుకున్నాం?.. అసలు రోడ్డు ప్రమాదాల పట్ల నిజంగానే మనం అప్రమత్తంగా వున్నామా?... ఇవన్నీ ఎవరినో కాదు..మనకు మనమే వేసుకోవాల్సిన ప్రశ్నలు.

ఇప్పటికైనా, చిత్తశుద్ధితో వ్యవహరించి, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం తక్షణ కర్తవ్యం. మృత్యువుకు ఎవరైనా ఒకటే. అయితే, కాలం తీరిపోయి పోవడం వేరు.. మన అజాగ్రత్తతో మన ప్రాణాలు మనమే పోగొట్టుకోవడం వేరు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులే కాదు, అందరూ గుర్తించి ప్రయాణాల్లో అప్రమత్తంగా వుండాలి. అందుకు, ఎప్పటికప్పుడు తగు ముందు జాగ్రత్తలు తీసుకోవడమే తరుణోపాయం!..

## దారుణం.. దయనీయం



ఇటీవల ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తీర్థయాత్రలకు వెళ్లి వస్తున్న ఒక వాహనం 50 అడుగుల లోతులో పడి, ఒకే కుటుంబానికి చెందిన 22 మంది మృత్యువాత పడడం దారుణం.. దయనీయం!.. 23 మంది ప్రయాణిస్తున్న ఆ వాహనంలో ఓ ఎనిమిదేళ్ల బాలుడు మినహా అందరూ ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. ఇకనైనా, బ్యారేజీల వద్ద, రోడ్ల మలుపుల వద్ద ప్రమాదాలు నివారించేందుకు, పొంచివున్న మృత్యుకోరల నుంచి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సివుంది.

# 24నుంచి పెట్రోలు బంకులు బంద్



ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి లారీలు, ఆయిల్ ట్యాంకర్లు, పెట్రోల్ బంకులు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్, ఏపి ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్, ఏపి పెట్రోలియం ట్యాంక్ ట్రక్ ఆపరేటర్స్ నాయకులు పేర్కొన్నారు. ది పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ డీజిల్, పెట్రోలుపై లీటరుకు అదనంగా పెంచిన రూ.4లు వ్యాట్ టాక్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోలు బంకుల యజమానులపై అగ్నిమాపక శాఖ అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. గతంలో వ్యాట్‌ను రద్దు చేయాలని సిఎం చంద్రబాబు, ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడును కలిసినట్లు తెలిపారు. ప్రస్తుతం లీటరుపై రూ.11 అదనంగా పెంచిన రూ.4తో కలిపి రూ.15వ్యాట్ టాక్స్‌ను కడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత టాక్స్ లేదన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి జిల్లా లారీయజమానుల అసోసియేషన్స్ కార్యదర్శి నారాయణరావు పాల్గొన్నారు.

# నెల్లూరుజిల్లా టీచర్లకు ఉత్తమ ర్యాంకులు


శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎస్‌వియూ రీసెట్)-2015లో నెల్లూరు జిల్లాకు చెందిన జడ్పీ ఉపాధ్యాయులు సోషియాలజీ, సైకాలజీ విభాగాల్లో మొదటి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ముదివర్తిపాళెం జడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న ఎస్.నరసింహమూర్తి సోషియాలజీ విభాగం మొదటి ర్యాంకును సాధించారు. అల్లూరు మండలం ఇస్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న బంకా శ్రీనివాసులు సైకాలజీ విభాగంలో రెండవ ర్యాంక్‌ను సాధించారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

## పెన్నా సాహిత్య పురస్కారానికి ఆహ్వానం

రాష్ట్ర స్థాయి ప్రతిష్ఠాత్మక పెన్నా సాహిత్య పురస్కారం - 2015 కొరకు 2014జూన్ 1 నుండి 2015జూన్ 30లోపు ప్రచురించిన కవితా సంపుటాలు 4 ప్రతులను ఆహ్వానిస్తున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి గుండాల నరేంద్రబాబు కోరారు. ఎంపికైన కవితా సంపుటి రచయితకు రూ.3వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని త్వరలో జరగబోవు 6వ వార్షికోత్సవంలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కవితాసంపుటాలను ఆగస్టు 31వ తేదీ లోపు పెన్నా రచయితల సంఘం, డోర్ నెం. 25-1-890, నేతాజీనగర్, 3వ వీధి, ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు-4కు పంపాలని కోరారు. ఇతర వివరాలకు 9493235992లో సంప్రదించాలని కోరారు.

# పాలమూరు ప్రాజెక్టు రాజ్యాంగ ఉల్లంఘన

తెలంగాణ సర్కార్ పాలమూరు అక్రమ ప్రాజెక్ట్ ద్వారా శ్రీశైలం జలాలు తరలించుకునే ప్రయత్నాలను సీమాంధ్రులు సమిష్టిగా ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు మిడతల రమేష్ పేర్కొన్నారు. కృష్ణ జలాల వివాదం కేంద్రప్రభుత్వం వద్ద విచారణలో వుండగానే, రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని ధిక్కరించి పాలమూరు ఎత్తిపోతల పథకానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయడం రాజ్యాంగ ఉల్లంఘన అని, తెలంగాణ జిల్లాలకు నీటిని తరలించుకునేందుకు సీమాంధ్రలోని వెనుకబడిన ప్రాంతాలకు కెసిఆర్ ద్రోహం తలపెడుతున్నారన్నారు. ఆంధ్రాప్రాంతానికి అన్యాయం చేసే కేసీఆర్ విధానాల పట్ల అన్ని రాజకీయపార్టీలు కలిసి ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు.




## కృత్రిమ ఆహారాలు తినకండి

మన దేశంలో తల్లిపాలు తప్ప ప్రతి పదార్థమూ కల్తీయే. స్వాతంత్రం వచ్చిన తదుపరి 10సంవత్సరాల పాటు దేశ ప్రజలు సవ్యంగానే ఉన్నారు. తదుపరి కృత్రిమ వాతావరణం పెరిగింది. సంప్రదాయాలని పక్కనపెట్టి ఆడవారు అయితేనేమీ మగవారు అయితేనేమీ ఇంట శ్రమపడే పనులు అనగా పెరటితోట, పారపనులు మాని వాకింగ్‌కు బయలుదేరుతున్నారు. దానికితోడు ఆహార అలవాట్లలో పాత అలవాట్లు అయిన వరి, గోధుమ, భోజనం మాని, ఉపాహారంలో పాత ఇడ్లీ, వడ, పూరి, దోశ మాని బజారులో దొరికే నకిలీ ఆహారం తింటున్నారు. సహజ మామిడిని మాని మ్యాగీ వరకు తినే విధానంలో మార్పు వచ్చి చిన్న వయస్సులోనే క్యాన్సర్‌కు లోనవుతున్నారు. సహజంగా ఇంట్లో తయారు అయ్యే సహజఆరోగ్యమైన పదార్థాలను అందరం తింటూ హాయిగా ఉందాం.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## యోగాపై పెడార్థాలు

అంతర్జాతీయ యోగా దినోత్సవంపై సైతం కొందరు కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం జుగుప్సాకరంగా వుంది. వీళ్ల తమ నీచబుద్ధిని మార్చుకోరు. యోగాలో సూర్యనమస్కారాన్ని తప్పుపట్టడం శోచనీయం. సూర్యుడు కేవలం హిందువులకు మాత్రమే దేవుడు కాదు. సూర్యుడే లేకపోతే ఈ భూమ్మీద జీవరాశి మనుగడ ఉంటుందా? సూర్యుడు కేవలం భారతదేశంలోనే ఉదయించి అస్తమిస్తున్నాడా? ఎండ, నీరు, గాలి, నిప్పు, నేల ప్రకృతి దైవాలు, వీటిని పూజించడం కూడా తప్పంటే ఎలా?

**సి.రాజీవి, నెల్లూరు.**

## కోర్టు వద్ద స్పీడ్ బ్రేకర్లు

నెల్లూరులో జిల్లా కోర్టు ప్రాంగణం ఎదుట ట్రంకురోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. రోజూ పెద్దసంఖ్యలో కక్షిదార్లు, ముద్దాయిలు, న్యాయవాదులు, పోలీసులు ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ వాహనాలు చాలావేగంగా వెళుతుంటాయి. రోడ్డు దాటాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్కడ స్పీడ్ బ్రేకర్లు వేయించాలి.

**చిముడుగుంట శ్రీలక్ష్మి, అడ్వకేట్, నెల్లూరు.**

## ఆ ఇద్దరికీ నై!

చాలామంది అనుకుంటున్నట్టు, బాబు పార్టీని కుమార రత్నానికి అప్పగించే ప్రశ్నే లేదు. బాలయ్య రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకట్ట వేయడానికే లోకేష్‌ను రంగంలోకి దించాడు. లోకేష్ గాని, బాలయ్య గాని ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే లేదు. బాబు వయస్సు 65సంవత్సరాలే! రాజకీయ జీవితం చాలా ఉంది. కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీతో జతకట్టు, సిబిఐ ఎంక్వయిరీ నుండి తప్పించుకుంటూ ఉండటమే బాబు శేష జీవితం!

**- కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# బీద బ్రదర్స్.. పార్టీలో అదుర్స్



**సుదీర్ఘకాలం పాటూ తెలుగుదేశంపార్టీని నమ్ముకున్నందుకు, దక్కీమొక్కీలు తిన్నా పార్టీలో నిలబడినందుకు బీద సోదరులకు పార్టీలో తగిన గుర్తింపు లభించింది. జిల్లా తెదేపాలో ఈరోజు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తర్వాత బీద సోదరులే కీలకనాయకులు. చంద్రబాబు వారిని ప్రత్యేకంగా గుర్తిస్తుండడం విశేషం.**

బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్రలు ఇప్పుడు పార్టీలో కీలకపాత్రల్లో ఉన్నారు. జిల్లాలో ఇంతవరకు బెజవాడ, మాగుంట, ఆనం, మేకపాటి, నల్లపరెడ్డి, నేదురుమల్లి వంటి రెడ్ల రాజకీయ కుటుంబాలే ఉండేవి. బలహీనవర్గాల నుండి ఒక్క బీద సోదరులు ఆ స్థాయికి రావడం విశేషం. బీద మస్తాన్‌రావు ఇప్పుడు రాజధాని కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది చాలా ప్రాధాన్యతగల పదవి. బీద మస్తాన్‌రావు 2000సంవత్సరంలో బోగోలు జడ్పీటీసీగా గెలిచాడు. 2004ఎన్నికల్లో ఆదాల వెంట కాంగ్రెస్‌లోకి వెళ్లి కూడా వెంటనే 'యూటర్న్' తీసుకున్నాడు. ఆ ఎన్నికల్లో అల్లూరు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందాడు. అయినా నిరాశ చెందక పార్టీనే కనిపెట్టుకుని వున్నాడు. 2009ఎన్నికల్లో కావలి అసెంబ్లీ నుండి గెలిచాడు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో బాగానే పనిచేసాడని పేరు తెచ్చుకున్నాడు. కాని 2014ఎన్నికల్లో వై.యస్. సానుభూతి బలంగా వుండడంతో స్వల్ప మెజార్టీ తేడాతో ఓడిపోయాడు. అయినా చంద్రబాబు వెంటనే ఆయనను రాజధాని కమిటీలోకి తీసుకున్నాడు.

బీద రవిచంద్రకు 2001 నుండి పార్టీ పదవులు తప్ప అధికార పదవులు రాలేదు. జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శిగా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడుగా చేసాడు. 2001 జడ్పీ ఎన్నికల్లోనూ, 2012శాసనమండలి ఎన్నికల్లోనూ ఆయనకు నిరాశ ఎదురైంది. 2014ఎన్నికల్లో నెల్లూరురూరల్ నుండి అసెంబ్లీకి పోటీ చేయాలని భావించినప్పటికీ ఆ సీటు బీజేపీకి పోవడంతో సరిపెట్టుకోక తప్పలేదు. రవిచంద్ర ఇప్పటివరకు పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని నిర్వహించారు. ఇప్పుడు అధ్యక్ష పదవితో పాటు ఎమ్మెల్సీ కూడా వచ్చింది. పార్టీలో బీద సోదరులు ఇద్దరూ పవర్‌ఫుల్ అయినట్లే!



# బాధితుల బాధలు తీరుస్తా

నెల్లూరురూరల్ కోడూరుపాడు మిక్స్‌డ్ కాలనీలో ఇళ్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన బాధితులను గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 16వ తేదీన పరామర్శించారు. బాధిత కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయంతో పాటు దుస్తులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం అందజేస్తున్న సాయం ఏమూలకూ సరిపోవడం లేదని, కనీస సాయంగా 50వేల రూపాయలు అందజేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు నారాయణ, పి.వెంకటరెడ్డి, బి.శ్రీనివాసులురెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే వెంకటేశ్వర ఆశయం



ఎన్‌ఆర్ఐ సహకారంతో 2011లో శ్రీ వెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ క్రమ శిక్షణ, ఉత్తమ విద్యాబోధన, ఉద్యోగ అవకాశాలు అనే ఆశయంతో స్థాపించబడి మాజీ కేంద్ర మంత్రి దగ్గుపాటి పురంధేశ్వరిచే ప్రారంభించబడిందని కళాశాల ఛైర్మెన్ డా॥ పెనుబల్లి బాబునాయుడు, ప్రిన్సిపల్ డా॥ బి.దత్తాత్రేయశర్మ తెలిపారు. ఈ కాలేజీలో సివిల్, మెకానికల్, ట్రిబుల్ ఇ, సిఎస్ఇ, ఇసిఇ విభాగాలతో మొత్తం 540సీట్లతో, మూడేళ్ళ పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులు ట్రిబుల్ ఇ, సివిల్, మెకానికల్ 180సీట్లతో నడుపబడుతుందని, గత 4సంవత్సరాల్లో వందశాతం అడ్మిషన్లు జరిగాయని తెలిపారు. జెఎన్‌టియు పరీక్షా ఫలితాల్లో అన్ని కళాశాలల కంటే ముందుందని అత్యాధునిక లేబొరేటరి, ఏసి తరగతి గదులు ప్రత్యేక ఆకర్షణగా ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కళాశాల తరపున దాదాపు కోటి రూపాయలు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతుందని, మొదటి బ్యాచ్‌లోనే 150మంది విద్యార్థినీవిద్యార్థులు 30 నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగావ కాశాలు పొందారని చెప్పారు. 2015-16 సంవత్సరంలో చేరే విద్యార్థిని విద్యార్థులకు ఎంసెట్ ర్యాంకు 10వేల లోపు విద్యార్థులకు సంవత్సరానికి 50వేల రూపాయలు చొప్పున 4 సంవత్సరాలు ఇవ్వబడుతుంది. ఎంసెట్ ర్యాంకు 10వేల నుండి 20వేలు లేదా ఇంటర్‌లో 975మార్కులుపైబడిన విద్యార్థినీవిద్యార్థులకు రూ.50వేలు ఒక్క సంవత్సరం ట్యూషన్ ఫీజు రాయితీ ఇవ్వబడుతుంది. ఎంసెట్ ర్యాంక్ 20వేల నుండి 30వేల లోపు లేదా ఇంటర్‌లో 950మార్కులు పైబడిన వారికి రూ.25వేలు ట్యూషన్ ఫీజు రాయితీ ఇవ్వబడుతుంది. బిటెక్ యూనివర్శిటి పరీక్షల్లో 85శాతం పైబడి మార్కులు సాధించిన వారికి రూ.10వేలు, 80శాతం పైబడిన వారికి రూ.5వేలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతుందని, ఇతర వివరాలకు 7032648099, 7032652899 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

# మంత్రిపదవి ఆశతోనా?




**ప్రకాశంజిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి పోటీలోకి దిగారు. ఆయన స్థాయికి ఈ పదవి చాలా తక్కువ. ఈ పదవికి పోటీ చేయొద్దని, మీ స్థాయికి తగింది కాదని సన్నిహితులు ఆయనకు చెప్పారు. అయినా శీనయ్య పోటీ చేసాడు. ఆయన పోటీకి దిగాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన కారణమే కనిపిస్తోంది. ఎమ్మెల్సీగా గెలిచాక మంత్రిపదవి ఇస్తానని మాగుంటకు చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా సమాచారం.**

ఇప్పటివరకు చంద్రబాబు కేబినెట్‌లో ఇద్దరు మాత్రమే రెడ్లు ఉన్నారు. ఒకరు చిత్తూరు జిల్లా నుండి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఇంకొకరు అనంతపురం జిల్లా నుండి పల్లె రఘునాధరెడ్డి. కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో రెడ్ల ఆధిపత్యం ఎక్కువ. గత ఎన్నికల్లో తెలుగుదేశం మైనార్టీలో పడింది ఈ జిల్లాల్లోనే. పార్టీ నుండి దూరమైన రెడ్లను దగ్గర చేర్చుకోవాలంటే కేబినెట్‌లో ఆ వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత కల్పించక తప్పదు. ఈ క్రమంలో చూస్తే నెల్లూరు నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కడప నుండి సతీష్‌రెడ్డి, ప్రకాశం జిల్లా నుండి మాగుంట శ్రీనివాసులురెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. ప్రకాశం జిల్లాలో వైశ్య వర్గానికి చెందిన శిద్దా రాఘవరావు మంత్రిగా వున్నారు. అయితే ఆయన జిల్లా మొత్తాన్ని ప్రభావితం చేయలేదు. మాగుంట ప్రభావం జిల్లా మీద అంతో ఇంతో ఉంటుంది. అయితే శిద్దాను తొలగించి శీనయ్యకు ఇవ్వడు. ప్రకాశం జిల్లాకు రెండో మంత్రి పదవి ఇవ్వాలనుకుంటేనే శీనయ్య మంత్రి కాగలడు. అది కూడా రెడ్లకు రెండు మంత్రి పదవులు అదనంగా ఇచ్చేటట్లుంటేనే శీనయ్యకు అవకాశం. చూద్దాం చంద్రబాబు మాట ఎంత వరకు నిజమవుతుందో?


● అరిష్టాలు తొలిగాయి

# వైద్యవిద్యకు రైట్ రైట్!




నెల్లూరులో ప్రభుత్వ వైద్యకళాశాల ఎప్పటినుండో వున్న కల. జిల్లాకు చెందిన స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ ప్రభుత్వ వైద్య కళాశాలను పెట్టించలేకపోయాడు. అలాంటిది గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆర్థికమంత్రిగా పనిచేసిన ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరుకు ప్రభుత్వ వైద్యకళాశాలను తీసుకు రాగలిగారు. వెనువెంటనే నిధులు మంజూరు చేయించి ఆఘమేఘాల మీద నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఆనం వాళ్లు తెచ్చారు కాబట్టి ఈ కాలేజీకి ఏసి సుబ్బారెడ్డి పేరు కూడా పెట్టుకున్నారు.

గత ఏడాది చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే నెల్లూరులో జరిపిన మొదటి కార్యక్రమం ఈ కాలేజీ ప్రారంభోత్సవమే. 2014-15 సంవత్సరంలో 150మెడికల్ సీట్లతో ఈ కళాశాల మొదటి బ్యాచ్ మొదలైంది. అయితే కొద్దికాలానికే ఈ కాలేజీ మీద ఆరోపణలు వెల్లువెత్తాయి. మౌలిక సదుపాయలలోనూ, సరైన బోధనా సిబ్బంది నియమించడంలోనూ ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వచ్చాయి. భారతీయ వైద్యమండలి బృందం రెండు నెలల క్రితం ఆ కాలేజీని సందర్శించి ఎన్నో లోపాలను గుర్తించారు. ఇన్ని లోపాలు పెట్టుకుని ఈ ఏడాది మొదటి సంవత్సరం ప్రవేశాలకు అనుమతినివ్వడం కష్టమేనని భావించారు. అయితే ప్రభుత్వ వైద్యకళాశాలలో ఏవైతే లోపాలున్నాయో, అవి ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో ఎప్పుడూ వుండేవే! కాకపోతే వైద్యమండలి సభ్యుల తనిఖీలప్పుడు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఆ లోపాలకు ప్యాచింగ్ వేసి కప్పెడుతుంటాయి. కాబట్టి ఈ లోపాలను సాకుగా చూపి నెల్లూరు మెడికల్ కాలేజీ అడ్మిషన్లు ఆపాల్సిన అవసరం లేదని చాలామంది భావించారు. నెల్లూరు మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు అనుమతులొస్తాయా? లేదా? ఈ మెడికల్ కాలేజీకి అనుమతులు రాకుండా తెరవెనుక కార్పొరేట్ రాజకీయ శక్తులేవన్నా పనిచేస్తున్నాయా అని చాలామంది అనుమానపడ్డారు. అయితే ఎట్టకేలకు ఆ అనుమానాలకు తెరదించుతూ 2015-16 సంవత్సరంలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు భారతీయ వైద్యమండలి ఆమోదం తెలిపింది.



# ఆన్‌లైన్ ఎరువులతో అవస్థలు


ధనుంజయరెడ్డి

ఆన్‌లైన్ ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ సరైన విధానం కాదని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని బ్యాంకు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరం, డైనింగ్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మీ-సేవలో చలానాలు కట్టి ఎరువులు పొందాలంటే ఎంతో సమయం వృధా అవుతుందని, ఈ పద్ధతి రైతులను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. ఈ పద్ధతి పైలట్ ప్రాజెక్ట్ క్రింద అమలులో వున్నా కూడా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడినంతగా ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా రైతాంగానికి ఈ ఆర్థిక సంవత్సరంలో 162కోట్ల రూపాయల ఋణాలను ఇవ్వాలని పాలకమండలి నిర్ణయించిందన్నారు. ఈ ఏడాది ఋణాలు ఇవ్వడంలో రైతులను వాణిజ్య బ్యాంకులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, సొసైటీల ద్వారా ఎంతమంది రైతులు వచ్చినా తాము ఋణాలు అందజేస్తామన్నారు. ప్రతి సొసైటీకి కోటి నుండి రెండుకోట్ల రూపాయల వరకు కేటాయించామన్నారు.

# వీనులవిందుగా శ్రేయ గాత్రకచేరి



నెల్లూరు ట్రంకురోడ్డు టివిఎస్ కళ్యాణ సదన్‌లో ఆదివారం అన్నమయ్య బాలగానసుధ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం స్వరపరచిన తిరుమల తిరుపతి దేవస్థానం వారి సీడీలోని సంకీర్తనలను సర్వేపల్లి శ్రేయ ఆలపించి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చదువుకు సంగీతం అడ్డు కాదని శ్రేయ నిరూపించిందని, సంగీత రంగంలో దూసుకుపోతుందన్నారు. విశ్వసాయి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ తనకు సంగీత పరిజ్ఞానం లేనప్పటికీ సంగీత జిజ్ఞాస ఉందని, సంగీతం మనిషిలోని ఆలోచనలను సక్రమమైన మార్గంలో నడిపేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రేయను సీనియర్ జర్నలిస్టు కె.వి.రమణయ్య, వివిఆర్‌కె మూర్తి, సురభి గాయత్రి తదితరులు శాలువాలతో సత్కరించారు. శ్రేయ ఆలపించిన సంకీర్తనలకు వయోలిన్ ఎల్.జయరామ్, మృదంగం ఐ.పినాకపాణి సహకారమందించారు. డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంకీర్తనల సిడిని తిరుమలలో ఈ నెల 7వ తేదీ ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవసభ కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవిప్రసాద్, డివి సురేష్‌రావు, వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ సత్యనాథ్, ఆలూరు శిరోమణిశర్మ, మాచవోలు రమేష్‌శర్మ, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానము
నర్రవాడ, దుత్తలూరు మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, ఫోన్:08629-240636
16 రోజుల పండుగ ఆహ్వానము
తేది 25.6.2015

జూన్ 7, 8, 9, 10, 11తేదీలలో అంగరంగ వైభవంగా జరిగిన భక్తుల ఇలవేల్పు శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలకు విచ్చేసి జయప్రదంగావించిన ప్రజాప్రతినిధులకు, ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా సహకరించిన అధికార యంత్రాంగానికి, అమ్మవారిని దర్శించుకొని తరించిన అశేష భక్తకోటికి ధన్యవాదాలు.
ఈ నెల 25వ తేదీ జరిగే శ్రీ వెంగమాంబ పేరంటాలు 16రోజుల పండుగలో భక్తులు అశేషసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందగలరని మనవి.
డా॥ తుమ్మల వెంకట సురేష్‌బాబు
వ్యవస్థాపక ధర్మకర్త
ఇట్లు
డబ్బుగుంట వెంకటేశ్వర్లు
కార్యనిర్వహణాధికారి

# నెల్లూరు కబుర్లు

## బడిబాట పట్టిన పిల్లలు



దాదాపు ఒకటిన్నర నెల సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. నెల్లూరురోడ్లపై ఆయా స్కూల్ బస్సులు రయ్‌మంటూ తిరుగుతున్నాయి. విద్యార్థులకే కాదు ఈ ఒకటిన్నర నెల స్కూల్ బస్సులకు కూడా విశ్రాంతినిచ్చినట్లయ్యింది. ఈ నెల 6నే నెల్లూరులో కొన్ని ప్రైవేట్ స్కూళ్లను తెరిచారు. అయితే అలా తీస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి గట్టిగా హెచ్చరించడంతో మళ్లీ మూసారు. మొదట 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం ఉంటుందని ప్రకటించినప్పటికీ ఆ పక్కరోజే రెండో శనివారం, ఆదివారం రావడంతో, ఏకంగా 15వతేదీ నుండి పాఠశాలలు పునఃప్రారంభించారు. విద్యాసంవత్సరం మళ్లీ మొదలు కావడంతో యూనిఫారాల అమ్మకాలతో వస్త్ర దుకాణాలు, పుస్తకాలు, స్టేషనరీ షాపులు బిజీగా ఉన్నాయి.

## హెల్మెట్‌లకు కౌంట్‌డౌన్




జూలై 1వ తేదీ నుండి ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ముందుగా పోలీసుల నుండే దీనిని ప్రారంభించారు. పోలీసులను చూసైనా అందరూ వాడక తప్పదు. హెల్మెట్ల వాడకంపై వాహనదారుల్లో అవగాహన తెచ్చే విధంగా పోలీసులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసుల కోసం ఎస్పీ గజరావ్‌భూపాల్ ప్రత్యేక చొరవ తీసుకుని చెన్నై నుండి హెల్మెట్లను తెప్పించారు. బైక్‌ల మీద కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు సైతం హెల్మెట్లను తప్పనిసరి చేసారు. 1వ తేదీ నుండి హెల్మెట్ లేకుండా బండి తోలితే చర్యలు తీసుకోనున్నారు.

కొన్నేళ్ల క్రితం కూడా హెల్మెట్ వాడకంపై జిఓ తెచ్చారు. కాని అది మూణ్ణాళ్ళ ముచ్చటగానే మారింది. హెల్మెట్ వాడడం మంచిదే. ప్రమాదాలు జరిగినప్పుడు కొంతవరకు ప్రాణాలను కాపాడుతుంది. వాహనదారులు కూడా ఇది ప్రభుత్వం కోసం కాదని, తమ కోసమేనని గుర్తించి ఆచరిస్తే మంచిది.

# రైతుల అభ్యున్నతికి కేంద్రం కృషి

### - బిజెపి నేత కర్నాటి



రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులు తమ పంటలను నిల్వచేసుకునేందుకు అవసరమైన గిడ్డంగుల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తోందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. ఈ నెల 13న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటిదాకా గిడ్డంగుల నిర్మాణం కోసం తొలి విడతగా రూ.56 కోట్లు, రెండవ విడతగా మరో 54కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. ఒక్క నెల్లూరుజిల్లాలోనే కావలి, కోవూరు, గూడూరు, వెంకటగిరి మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో దాదాపు 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం వున్న గిడ్డంగుల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. వరి సాగు ఎక్కువగా వున్న ఆత్మకూరు ప్రాంతంలోనూ 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునేలా గిడ్డంగుల నిర్మాణం చేయాలన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద కొన్ని మార్కెటింగ్ కమిటీలను ఎంపికచేసి ఆన్‌లైన్ ట్రేడింగ్ విధానం ప్రవేశపెట్టడం సంతోషకరమన్నారు. అయితే, ఎక్కువ రోజులు నిల్వ వుండని నిమ్మకాయలు, కూరగాయలు వగైరాలను ఈ ట్రేడింగ్‌లో పెట్టడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి వుందన్నారు. ఈ విధానాన్ని చక్కదిద్దాలని కోరారు. ఈ సమావేశంలో ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ కుడుముల సుధాకరరెడ్డి, నాయకులు మారుబోయిన శ్రీనివాసులు గౌడ్, నరసింహులునాయుడు, బుజ్జిరెడ్డి, మురళి, కె.మధు, పరశురాం, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# ముసవ్వీర్ మరో అద్భుతం



సూక్ష్మ కళాకారుడు నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ స్వర్ణంతో మరో అద్భుతాన్ని రూపొందించాడు. గతంలో స్వర్ణం, వెండితో ఎన్నో సూక్ష్మ కళారూపాలను తయారుచేసి అందరి మన్ననలు అందుకొన్నాడు. ఈసారి బడిబాట సందర్భంగా బడి పిలుస్తోంది, పనికెందుకు తొందర, చదువుకో ముందర... అనే నినాదంతో కేవలం 700మి.గ్రా బంగారంతో ఒక కలం మీద 5మంది బాలబాలికలు పాఠశాలకు వెళుతున్నట్లు, పాఠశాల అనే బోర్డును తయారు చేశాడు.



దీనిని తయారు చేయడానికి రెండురోజులు సమయం పట్టిందని, కలం ఎత్తు 1సెం.మీ, పొడవు 9సెం.మీలని ముసవ్వీర్ తెలిపాడు.

# ప్రతాప్ డిశ్చార్జ్



బెంగుళూరు నుండి నెల్లూరు వస్తూ కారు ప్రమాదానికి గురైన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అపోలో ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ప్రమాదం జరిగిన రోజు కారును ప్రతాప్ బంధువు నడుపుతున్నట్లు తెలుస్తోంది. కారు చెట్టును ఢీకొంది. వెంటనే కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో ఎవరికీ పెద్దగా గాయాలు కాలేదు. ప్రతాప్‌ను ఫోన్‌లో వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డిలు పరామర్శించారు.

# వివిఎస్‌యూ కన్సల్టెంట్‌కు డాక్టరేట్

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న జ్యోతిర్మయి రెడ్డికి ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈమె వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సంతృప్తిగా ఉన్నారా? అనే అంశంపై పరిశోధనా పత్రాలను సమర్పించింది.

# మంచిరోజులు లేవని...

నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడిగా మొన్నకరోజు మునుకూరు రవికుమార్‌రెడ్డి హంగూ ఆర్భాటం లేకుండా ప్రమాణస్వీకారం కానిచ్చారు. ఆయనతో పాటు 10మంది డైరక్టర్లు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఇంకో నాలుగు నెలల దాకా మంచి ముహూర్తములు లేవని అయ్యవార్లు చెప్పడంతో ఆయన అదరాబదరాగా ప్రమాణస్వీకారం చేసినట్లుంది.

### సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా

# ఆదినారాయణ



ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ సర్వేయర్ దొడ్డి ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధానకార్యదర్శిగా వెంకటాచలం సర్వేయర్ సుబ్బరాయుడు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఆదినారాయణ జిల్లాలో పలు ప్రాంతాలలో పనిచేసారు. అధికారుల వద్ద మంచి పేరుంది. కష్టపడి పనిచేస్తాడనే గుర్తింపు వుంది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఆదినారాయణ, సుబ్బరాయుడులకు 'లాయర్' అభినందనలు.

# రౌడీబ్రదర్స్... మారండి

నెల్లూరు ఒకటవ నగర పోలీసుస్టేషన్లో సోమవారం సిఐ నరశింహారావు రౌడీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేసిన తప్పులు తిరిగి పునరావృతం అయితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. మీరు చేసే ప్రతి పనిపై పోలీసుల నిఘా వుంటుందని, మీ నడవడిక మార్చుకుని సమాజంలో అందరిలా బతుకుతూ కుటుంబసభ్యులతో సంతోషంగా ఉండాలన్నారు.

# దొంగల బాస్.. ఈ పోలీస్

*నెత్తిన మూడు సింహాల టోపీ, ఒంటి మీద ఖాకీ యూనిఫాం, చేతిలో లాఠీ... ఏ జన్మలోనో లేదంటే ఈ జన్మలోనో అదృష్టం చేసుకుని వుంటేనే వీటిని కలిగి వుంటాము. పోలీసు ఉద్యోగం అంటే అది బ్రతుకుదెరువు మార్గం కాదు. ప్రజలకు, ఊరికి, రాష్ట్రానికి, దేశానికి సేవ చేయడానికున్న మార్గం. అదృష్టవంతుడు పోలీసు అవుతాడు. దరిద్రుడు దొంగవుతాడు. అదృష్టాన్ని వదిలించుకుని దరిద్రాన్ని తగిలించుకునేవాడు పోలీసు నుండి దొంగగా మారుతాడు. ఎలా అంటే ఇదిగో ప్రకాశంజిల్లా మార్కాపురం ఓ.ఎస్‌డి సమయ్‌జాన్‌రావ్‌లాగా!*



ఇతనేం... పోలీస్ రా బాబు

ఇతను సాదాసీదా కానిస్టేబుల్ కూడా కాదు. ఐపిఎస్ అధికారి. త్వరలో ఎస్పీ కూడా అవుతాడు. కాని పోలీసు ఉన్నతాధికారిగా వున్న అతనిని డబ్బు మీద వ్యామోహం దొంగగా మార్చింది. అతని గురించి తెలిసి రాష్ట్ర పోలీస్ యంత్రాంగమే నివ్వెరపోయింది. మే14వ తేదీన కావలి నుండి చెన్నైకి వెళుతున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో బంగారు వ్యాపారులను తుపాకులతో బెదిరించి వారి నుండి 86.55లక్షల రూపాయల నగదును పోలీసులమని నలుగురు ఆగంతకులు దోచుకుపోయారు. ఈ సంఘటన గురించి తెలిసి వెంటనే అలర్ట్ అయిన పోలీసులు ఆరోజు సాయంత్రానికల్లా వారిని ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద పట్టేసారు. తీరా చూస్తే ఆ దొంగల్లో ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లు చిరిగిరి రవి, తూపిలి శివకృష్ణ, గుద్దంటి కిరణ్‌బాబుతో పాటు ఒరిజినల్ దొంగయిన నాగరాజు కూడా వున్నారు. అయితే పోలీసు విచారణలో ఈ దోపిడీ వెనుక ప్రధాన సూత్రధారి సమయ్‌జాన్ రావ్ అనే విషయం వెలుగు చూసింది. దోపిడీ జరిగాక కావలి పోలీసులు పట్టుకున్న ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లను వదిలేయాలని ఓఎస్‌డి ఒత్తిడి తెచ్చారు. అయితే పోలీసులకు ఒరిజినల్ దొంగ నాగరాజు దొరికాక అసలు కథంతా బయటపడింది. ముఖ్యంగా ఈ దోపిడీలో ఓఎస్‌డి పాత్రను నిర్ధారించడంలో సెల్‌ఫోన్ కాల్స్ బాగా ఉపయోగపడ్డాయి.

**శభాష్ పోలీసు:** తమ మధ్య ఖాకీ ముసుగు వేసుకుని తిరుగుతున్న పోలీసు దొంగను పట్టుకోవడంలో జిల్లా పోలీసు యంత్రాంగం ప్రశంసనీయపాత్రను పోషించింది. ఓఎస్‌డి ఒత్తిళ్లకు లొంగకుండా, సాక్ష్యాధారాలను తారుమారు చేయకుండా సమగ్రంగా దర్యాప్తు జరిపి ఈ కేసులో ఓఎస్‌డి పాత్రను బట్టబయలు చేయడంలో జిల్లా పోలీసులు సమర్ధవంతంగా వ్యవహరించి డిజిపి నుండి మన్ననలు అందుకోవడం విశేషం.



### మాట వినలేదని
# బదిలీ వేటు

తెలుగుదేశం నాయకులు అధికార దర్పం చూపిస్తున్నారు. తమ మాట వినకుంటే అధికారులకు బదిలీ తప్పదన్న సంకేతాలను బలంగా పంపుతున్నారు. ఇప్పటికే గత ఎస్పీ సెంథిల్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబులు అధికార రాజకీయ ఒత్తిళ్లకే బదిలీ అయ్యారు. వీరిలో ఎవరూ గట్టిగా సంవత్సరం కూడా పనిచేయలేదు. అధికారపార్టీ వారి అడుగులకు మడుగులొత్తకపోవడం వల్లే బదిలీ కావాల్సి వచ్చింది. ఈ జాబితాలో ఇప్పుడు నెల్లూరు జడ్పీ సిఇఒ ఎం.జితేంద్ర కూడా చేరిపోయారు. ఆయనను ఉన్నట్లుండి విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీ చేసారు. దీని వెనుక కారణం అధికారపార్టీ ఒత్తిడే!

ఈ నెల 8న తెలుగుదేశం నేతల మాటను ఖాతరు చేయకుండా జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించడమే ఆయన బదిలీకి అసలు కారణం. అదేరోజు గుంటూరులో ప్రభుత్వం ఆధ్వర్యంలో సంకల్పదీక్ష పెట్టారు. జిల్లాలోని తెలుగుదేశం జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు ఆ సభకు పోవాల్సి వచ్చింది. దీంతో ఆరోజు సమావేశాన్ని వాయిదా వేయాలని వాళ్లు కోరారు. అయితే సంకల్పదీక్ష కంటే ముందే జడ్పీ సమావేశం తేదీ ఖరారైందని, ఇప్పుడు వాయిదా వేయలేమంటూ ఆరోజు సమావేశాన్ని పెట్టారు. తెలుగుదేశం సభ్యులంతా జడ్పీ సమావేశానికి గైర్హాజరయ్యారు. తాము వాయిదా వేయమన్నా జడ్పీ సిఇఓ సమావేశం నిర్వహించాడంటూ తెలుగుదేశం సభ్యులు చంద్రబాబుకు ఫిర్యాదు చేసారు. దీంతో ఆయన కూడా సీరియస్ అయ్యారు. దాని ఫలితంగానే జితేంద్ర విజయనగరంలో పడ్డాడు.

# చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించాలి

**- జిల్లా కలెక్టర్**



చేనేత, సిల్క్ తదితర వస్త్రాలను కొనుగోలు చేసి చేతి వృత్తుల కళాకారులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ యం.జానకి అన్నారు. ఇటీవల నెల్లూరు టిటిడి కల్యాణ మండపంలో లేపాక్షి చేనేత అభివృద్ధి సంస్థ వారిచే ఏర్పాటు చేసిన లేపాక్షి - కాటన్, చేనేత వస్త్రాల ప్రదర్శనను కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో దాదాపు ఆరు రాష్ట్రాల నుండి వివిధ చేతివృత్తుల, కళాకారులచే తయారు చేయబడిన వస్త్రాలను, వస్తువులను 15స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. మన జిల్లాలోని ఉదయగిరి, వెంకటగిరి, పాటూరు ప్రాంతాల నుండి వస్త్ర ప్రదర్శనలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివిఎస్‌వి మూర్తి, లేపాక్షి చేనేత అభివృద్ధి సంస్థ సీనియర్ మేనేజర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అక్కడ రాంగ్... ఇక్కడ రైటా?

**- నగర ఎమ్మెల్యే పి.అనిల్**



తెలంగాణలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు టిఆర్ఎస్‌లో చేరితే తప్పంటున్నారు. కోట్లు పెట్టి కొంటున్నారంటున్నారు. మరి ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ కాంగ్రెస్ ఎంపీలను, జడ్పీటీసీ, మేయర్లు, కార్పొరేటర్లను ఎన్ని కోట్లిచ్చి కొన్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రశ్నించారు.

ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో టిఆర్ఎస్ చేస్తే రాంగ్, ఇక్కడ మీరు చేస్తే రైటా అని అడిగారు. తెలంగాణలో టిఆర్ఎస్‌లో చేరిన తెలుగుదేశం ఎమ్మెల్యేలను రాజీనామా చేసి తిరిగి గెలవాలని అడుగుతున్నారు. మరి ఆంధ్రాలో వైయస్సార్ కాంగ్రెస్ నుండి గెలిచిన ఎంపీలను, మేయర్లను, జడ్పీటీసీలను, కార్పొరేటర్లను మీ పార్టీలో చేర్చుకున్నారు. వారందరి చేత రాజీనామాలు చేయించి గెలిపించుకునే దమ్ము మీకుందా అని ఆయన తెలుగుదేశం నాయకులకు సవాల్ విసిరారు. అక్కడ టిఆర్ఎస్‌లో చేరే ఎమ్మెల్యేలను చూసి రచ్చ చేస్తున్న తెలుగుదేశం నాయకులు ఇక్కడ వైకాపా నుండి వచ్చే వారికి కండువాలు కప్పి ఎలా ఆహ్వానం పలుకుతారని ప్రశ్నించారు. ఆంధ్రాహజారేగా ట్యాగ్ తగిలించుకున్న చంద్రబాబు ఎమ్మెల్యే కొనుగోలు కేసులో అడ్డంగా దొరికిపోయాడని ఆయన నిజస్వరూపమేంటో లోకానికి తెలిసిపోయిందని అనిల్ ఎద్దేవా చేశాడు.

# సత్వర న్యాయం.. లోక్అదాలత్ ధ్యేయం

దేశవ్యాప్తంగా కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే ధ్యేయంతో ప్రతి నెలా రెండవ శనివారం నాడు జాతీయ స్థాయిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు అన్నారు. ఈ నెల 13న జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, లోక్అదాలత్ ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోనూ, జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 199 కేసులను పరిష్కరించారు. నగరంలో ఏర్పాటుచేసిన బెంచ్‌లకు న్యాయమూర్తులు ఎస్వి నరసింహరాజు, వి.పాపిరెడ్డి, సిహెచ్ శ్రీరామచంద్రమూర్తి, నాల్గవ అదనపు మెజిస్ట్రేట్ వాసుదేవన్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి పలు కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్ ద్వారా 71 మోటారు ప్రమాద వాహన కేసులు, 22 సివిల్ కేసులు, 78 క్రిమినల్ కేసులు, 28 ప్రీ లిటిగేషన్ కేసులకు పరిష్కారం లభించింది.

# ఆర్భాటంగా మంత్రి బర్త్‌డే



రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు నెల్లూరురూరల్ మండలం చింతారెడ్డిపాళెంలోని నారాయణ ఆసుపత్రిలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ తల్లి సుబ్బమ్మ కేక్‌ను కట్ చేసారు. మంత్రి నారాయణ విద్యావేత్తగా గుర్తింపు సాధించడంతో పాటు ఉచిత ఆరోగ్యమస్తు పథకం ద్వారా ఎంతోమంది రోగులకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన మంచివ్యక్తి అని వక్తలు కొనియాడారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రుల డెరెక్టర్ సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీరామ్ సతీష్, అడిషనల్ సూపరింటెండెంట్ సతీష్‌కుమార్, ఏజిఎం భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ నరశింహారెడ్డి, సుబ్బారావు, జెయస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## పొనకా దంపతుల...
# దత్తత వార్డుల్లో అభివృద్ధి పనులు



గూడూరు పట్టణంలోని 15వ వార్డును ప్రముఖ పారిశ్రామికవేత్త పొనకా శివకుమార్‌రెడ్డి, 17వ వార్డును మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన దత్తత తీసు కున్నారు. రెండు వార్డులను అభివృద్ధి చేయాలనే తలం పుతో సొంత నిధులను కేటాయించి మురికి కాలువల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న సిల్టును తొలగించారు. గత నాలుగు రోజులుగా ప్రైవేటు సిబ్బంది, ప్రైవేటు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి కాలువల్లో 5అడుగుల మేరా ఉన్న మురికిని తీసేలా చర్యలు తీసుకున్నారు. తీసిన సిల్టును ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. దీంతో మసీదు వీధి, గాంధీబొమ్మ సెంటర్, బొడ్డుచౌక, ప్రాం తాలమీదుగా వున్న మురికి కాలువలు పరిశుభ్రంగా మారాయి. డ్రైనేజీ నీరు కాలువల్లో నిల్వ వుండకుండా పోతు న్నాయి. దీంతో రెండువార్డులు అభివృద్ధి కావడం పట్ల స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఇన్నర్‌వీల్ క్లబ్‌చే టాయిలెట్ బ్లాక్



టాయిలెట్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, మైథిలి

ఇన్నర్‌వీల్ క్లబ్ గూడూరు వారి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశు మందిరం నందు బొమ్మిరెడ్డి సాయిచైతన్య మరియు డాక్టర్ సి.రోహిణిల ఆర్థిక సహకారంతో రూ. 1,50,000లతో బాలుర మరియు బాలికలకు టాయిలెట్లు నిర్మించడం జరిగింది. ఈ టాయిలెట్లను రోటరీ మాజీగవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి ప్రారంభించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బొమ్మిరెడ్డి మైథిలి మాట్లాడుతూ ఈ సంవత్సరం మా క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల మీద డాక్టర్ సిఆర్ రెడ్డి ఎంతో మక్కువతో అనేక వసతులు ఏర్పరిచారని, ముఖ్యంగా ఎక్కువమంది గిరిజన పిల్లలు చదువుతున్నారని, అలాంటి పిల్లలకు ఈ టాయిలెట్స్ నిర్మించినందుకు ఇన్నర్‌వీల్ క్లబ్‌ను అభినందిస్తున్నానన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సిఆర్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి వై.లక్ష్మి, ఎమ్.జీవని, వై.స్నేహలత, కె.సుందరరామిరెడ్డి, కె.సీతారెడ్డి, ప్రధానో పాధ్యాయులు నాగేశ్వరరావు, యుగంధర్, రోటరీ అధ్యక్షులు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ బి.శ్రీనివాస్, ప్రక్కన జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

# జనవిజ్ఞాన వేదిక ప్రతిభా పురస్కారాలు

2014-15 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రతిభా పురస్కారాలను అంద జేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన డిఎస్పీ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలతో పాటు డిక్షనరీలు, జిప్ బ్యాగు, మెమొంటోలు అందజేసేందుకు ముందుకు వచ్చిన జేవీవీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పట్టణం, రూరల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన 13మంది విద్యార్థులకు అవార్డులను అందజేయడం జరిగిందన్నారు. డాక్టరేట్ సాధించిన కుడుముల వెంకటనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేవూరు విజయ కుమార్‌రెడ్డి, సి.ఐ సుబ్బారావు, ఎస్సై బాబి, కె.మునిగిరీష్, కోట సునీల్‌కుమార్, మనపాటి రవీంద్రబాబు, జేవీవీ నాయకులు నాగరాజు, ఉపాధ్యక్షులు నారాయణ, శేషయ్య, రాజశేఖర్‌రెడ్డి, బాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమం చేసైనా
# ఎర్రచందనాన్ని కాపాడుకుందాం



ప్రజా ఉద్యమం చేసైనా తిరుమల అడవుల్లో ఎర్రచందనాన్ని కాపాడుకుందా మని ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జులేపా పీర్ చిష్టి యుల్ ఖాదరీ వలీ అల్లా వారి ఉరుసు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఉరుసు అనంతరం ఏర్పాటు చేసిన పత్రికావిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతం ముఖ్యం కాదు మనుషులు ముఖ్యం, మనుషుల్లోని మనస్సులు ముఖ్యమన్నారు. ఒకనాడు పుణ్యపురుషులు సమాజానికి సేవలందిస్తూ జీవసమాధి అయ్యేవారనీ, అలాంటి వారి పేరుతో ప్రతి యేడాది వార్షికోత్సవాలు నిర్వహించటం మన సంప్రదాయమ న్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జు లేపావల్లి దర్గా, కెవిబిపురం మండలం లోని అంజూరు దర్గా మిర్జావల్లి అల్లాహ్ దర్గాలు ఎంతో ప్రాశస్త్యం పొందుతాయ న్నారు. గంధోత్సవాలు మత సామరస్యానికి నిదర్శనమన్నారు. కులాలు, మతాలు జాతి భేదాలు లేకుండా నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలతో మనస్సులు కలుస్తాయ న్నారు. ఎర్రచందనం చాలా అద్భుతమ న్నారు. కళాకారులుగా ఎర్రచందనం అక్రమ రవాణాను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఎర్ర చందనంపై ప్రజా ఉద్యమం తప్పదన్నారు.

శ్రీకాళహస్తి పట్టణంలో ఉన్న సువర్ణ ముఖినది తీరాన పురాతన కాలంలో నిర్మించిన దర్గాలో వెలసిన సత్యసంధుడు, మహానీయుడు హజరత్ జులేపీర్ షావలీ జీవసమాధి ఆయన ప్రాశస్త్యాన్ని కొని యాడారు. పట్టణంలోని ప్రజలు కుల



# శ్రీకాళహస్తి న్యూస్

మతాలు, వర్గాలకు అతీతంగా పూజిస్తా రన్నారు. ధ్యానిస్తారన్నారు. భక్తి ప్రవృత్తు లతో ప్రణమిల్లుతూ తమ కోర్కెలను తీర్చుకుంటూ బాధలనివృత్తికి దేవుని వద్ద ప్రార్థించమంటూ వేడుకుంటున్నారన్నారు. పూర్వం ఈ పరిసర ప్రాంతాల్లో జు లేపీర్ బాబా ఆధ్యాత్మిక వాదిగా విరా జిల్లుతున్నారన్నారు. ప్రస్తుతం సమాధి ఉన్న ప్రాంతంలో ఆయన నివాసముంటూ దైవ ప్రార్థనలు చేసుకుంటూ జీవసమాధి కావడం ఎంతో పుణ్యం చేసుకున్నార న్నారు. వారి సోదరుడు దాదాపీర్ ఆయన సోదరిలు ఇక్కడ ఉంటూ మృతి చెందగా సమీపంలో సమాధి చేశారన్నారు. ఈ దర్గాలో దీర్ఘకాలంగా గాలి సోకినవారు ఇక్కడ నెలల తరబడి ఉంటూ ప్రదక్షిణలు చేస్తారు. తమను ఆవహించిన గాలితొలగి పోయే వరకు ఇక్కడే ఉంటూ ధ్యానిస్తార న్నారు. గాలిసోకినవారు ఎవరూ ఊహిం చని రీతిలో హేతువాదులు, ఆధ్యాత్మిక వాదులు సైతం ఆశ్చర్యపోయేలా "మస్తా నయ్యా మమ్మల్ని వదిలిపెట్టు" అంటూ గడువులోపల వెళ్లమంటూ మాట్లాడటం గమనించదగ్గ విషయమన్నారు. ఇక ప్రతి గురువారం, శుక్రవారాల్లో ఈ దర్గాలో ముస్లిం భక్తులతో సమానంగా హిందువులు కూడా ఉండడం చాలా అద్భుతంగా ఉం టుందన్నారు. ఎంతోమంది హిందువులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనల్లో పాల్గొ నడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపి వరప్రసాద్, చిత్తూరు జిల్లా ఎస్.పి. శ్రీనివాస్, తిరుపతి ఏఎస్‌పి గోపీనాథ్, విశాఖపట్నం ఆర్‌టిఓ మురళీధర్, వైఎస్ఆర్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అంజూరు తారక శ్రీనివాసులు, రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి, టిటిడి ట్రస్టు బోర్డు మెంబర్ డి.భానుప్రకాష్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, యం.యస్.అక్బర్ బాదుషా, యం.యస్. జమ్మద్‌బాదుషా, సయ్యద్ అహ్మద్, నెహ్రూప్రసాద్, కాలేషా, మునవ్వర్, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌అదాలత్‌లో 14కేసులు పరిష్కారం



**- ఏడో అదనపు జిల్లా జడ్జి గురప్ప**

గూడూరు కోర్టులో 13వ తేదీ జరిగిన లోక్ అదాలత్‌లో 14కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ఏడో అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప మాట్లాడుతూ పలు దేశాల్లో లోక్‌అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమవుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రతి నెల రెండో శనివారం లోక్‌అదాలత్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. రాజీమార్గమే రాజ మార్గమన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. రోడ్డు ప్రమాద కేసులు 7, భరణం కేసులు 2, క్రిమినల్ కేసులు 2, సివిల్ 2, మరో కేసు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జీలు ఏడుకొండలు, సాయిరాం, లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, బాధితులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులందరికీ సరుకుల పంపిణీ



ఈ పాస్ విధానాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

ఈ-పాస్ విధానంలో వేలి ముద్రలు సరిగా పడని వాళ్లకు సరుకులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని గూడూరు తహశీల్దార్ వెంకటనారాయ ణమ్మ తెలిపారు. పట్టణంలోని రాణిపేట వద్దనున్న 28వ వార్డు లోని చౌక ధరల దుకాణాన్ని ఆదివారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ సీడింగ్ సరిగా లేకపోవడంతో వేలిముద్రలు తీసుకోవడం లేదని, దీంతో పొదుపు సభ్యుల సహకారంతో వారికి కూడా సరుకులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాస్ విధానం ద్వారా ఇప్పటికే 60శాతం సరుకులు పంపిణీ చేశామన్నారు. తహశీల్దార్ వెంట విఆర్వో నాగార్జునరెడ్డి తదితరులున్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చులు అధికంగా ఉంటాయి. అయితే ధనానికి ఇబ్బంది ఉండదు. వృత్తి వ్యాపారములందు అభివృద్ధి, ఆదాయం పెరగడం ఉంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. ఉద్యోగప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. రావలసిన బాకీలు కొంతమేర అందుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అనుకున్న కార్యక్రమాలు సమర్ధవంతంగా పూర్తి చేస్తారు. వ్యాపారవృద్ధి ప్రయత్నాలకు ప్రణాళికలు తయారు చేస్తారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఖర్చులు అదనంగా ఉండకతప్పవు. ఇతరులకు సహాయ పడటం, ఉద్యోగులకు అధికారులతో సానుకూలత ఉంటుంది. పరుషంగా మాట్లాడడం, అనవసర విషయాలలో జోక్యం చేసుకోవడం తగదు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యాపార, వృత్తి జీవనం కలిగినవారు కొత్త పథకాలు గూర్చిన ఆలోచనలు, ఆదాయమున స్వల్ప పెరుగుదల ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి త్వరలో అవకాశాలుంటాయి. పట్టుదల కోపాలను వదలి వ్యవహారాలను సామరస్యంగా పరిష్కరించుకొనండి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చిరువ్యాపార వర్గాలకు ఆదాయం పెరుగుతుంది. మిగిలిన వారికి ఆదాయ వ్యయాలు ఫరవాలేదనిపించును. కుటుంబసభ్యుల మధ్య స్వల్ప విభేదాలుండి సర్దుబాటు కాగలవు. వ్యాపారులకు ఉద్యోగులకు ప్రభుత్వ అధికారుల వల్ల ఇబ్బందులుండవచ్చును. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనండి. చేపట్టిన పనులు సానుకూలమైనను విమర్శలకు గురికావలసి వస్తుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. గురు శుక్ర వారాలలో ఆర్ధిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి. అనుకోని ప్రయాణాలుండటం, షేర్ మార్కెట్ నిరుత్సాహ పరచడం జరుగుతుంది. కళా, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. విద్యార్ధులకు మంచి అవకాశాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపకాలు పెరగడం వల్ల అనుకున్న పనులు సరిగా చేయలేక టెన్షన్ పడుతుంటారు. వృత్తి వ్యాపార వర్గాలకు ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అభివృద్ధి రేటు తగ్గుతుంది. శుభకార్యాల ప్రయత్నాలు అనుకూలించే అవకాశమున్నది. ఉన్నత చదువులకు అవకాశాలు దొరుకుతాయి. కొంత వరకు ఋణ సమస్యలు పరిష్కారం కాగలవు.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 19.06.2015 నుండి**
**తేది. 25.06.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, వృషభంలో బుధుడు, మిధునంలో రవి కుజులు, కర్కాటకంలో గురు శుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, కర్కాటకంలో సింహ కన్య తుల రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు లేవు

### జ్యేష్ఠమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | తదియ | రాIIగం.7.14వII |
| తేది. 20 | శని | చతుర్ధి | రాIIగం.8.13వII |
| తేది. 21 | ఆది | పంచమి | రాIIగం.9.38వII |
| తేది. 22 | సోమ | షష్ఠి | రాIIగం.11.26వII |
| తేది. 23 | మంగళ | సప్తమి | రాIIగం.1.25వII |
| తేది. 24 | బుధ | అష్టమి | రాIIగం.3.27వII |
| తేది. 25 | గురు | నవమి | రాIIగం.5.22వII |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తివ్యాపారాలలో అవకాశాలు, అభివృద్ధి తగ్గుతుంది. సంప్రదింపులు, అగ్రిమెంట్ల విషయాలలో ఆలోచించి వ్యవహరించండి. బంధువర్గంతో సమస్యలు రావచ్చును. అనుకున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పైనబడగలవు. ప్రముఖులను కలవడం, అనుకోని ప్రయాణాలుంటాయి. ఉద్యోగార్ధులకు చిరు అవకాశాలు దొరకగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు, చేపట్టిన వ్యవహారాలను సక్రమరీతిలో నిర్వహించలేక పోవచ్చును. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. ఉద్యోగులకు వ్యాపార వర్గాలకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆదాయం తగ్గవచ్చును. శుభకార్య ప్రయత్నాలలో నేర్పరితనం అవసరం.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

తొందరపాటు వ్యవహారాలతో ఇబ్బందులు పడతారు. వృత్తి వ్యాపారాలు ఆశించిన తీరుగా ఉండవు. ఆదాయం తగ్గుతుంది. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఖర్చులు అదనంగా ఏదో ఒక రూపంలో ఉండి తప్పించుకొనలేరు. కోర్టు వ్యవహారాలు టెన్షన్ కలిగిస్తాయి. కుటుంబంలో చిన్నచిన్న విభేదాలు కలుగవచ్చును. విద్యార్థులు ఉన్నతవిద్య విషయంలో ఆందోళనగా ఉంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి కొరకు ప్రయత్నాలు చేస్తారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. బాకీల విషయంగా వత్తిడులకు లోనుకాగలరు. అధికారుల అనుమతులు ఆలస్యం కాగలవు. అనుకున్న పనులకు స్వల్ప ఆటంకాలున్నా, పని పూర్తి చేస్తారు. విద్యార్థులకు ఉన్నత అవకాశాలు దొరకడం, విలువైన సామాగ్రిని కొనడం, అనుకోని దూరప్రయాణాలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

రావలసిన బాకీలు వసూలుకాగలవు. కుటుంబ సభ్యులలో సరైన అవగాహన లేక అభిప్రాయ భేదాలు ఏర్పడవచ్చును. అనుకున్న పనులను సాధించుకొంటారు. ఉన్నత విద్య, శుభకార్యాలపై దృష్టిపెడతారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆదాయం సామాన్యం. కొత్త కాంట్రాక్టులు, కొత్త ఏజన్సీలకు ప్రయత్నాలు చేయండి. జరిగిపోయిన విషయాలు గుర్తుచేసి ఇతరులను బాధపెట్టొద్దు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఖర్చులు పెరుగుతాయి. ఆశించినంత ఆదాయముండదు. వృత్తివ్యాపారాలలో శ్రమకు తగ్గ రాబడి ఉండదు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. దూరప్రయాణాలు జరుగుతాయి. చెల్లింపులు సకాలంలో చెల్లిస్తారు. కొత్త పెట్టుబడులకు ప్రయత్నాలు చేయడం, క్రయవిక్రయాలు నిర్ణయం కావడం జరుగుతుంది. శుభవార్తలు వినడం జరుగుతుంది.

# కన్నీళ్లు పెట్టిన అన్నాహజారే

శ్రీను గల్పిక

అది కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటూ ఆంధ్రావాళ్లను రాచి రంపాన పెడుతున్న హైదరాబాద్ నగరం. 'ఓటు - ఐదుకోట్లు' ఎపిసోడ్ పరిణామాలపై చర్చించేందుకు చంద్రబాబు తన మంత్రులు కె.ఇ.కృష్ణమూర్తి, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, యనమల రామకృష్ణుడు, బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, పి.నారాయణ, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఎంపీ జె.సి.దివాకర్‌రెడ్డి వంటి వారితో సమావేశమయ్యారు. చంద్రబాబు మొదట మాట్లాడుతూ... ఈ కేసీఆర్ మరీ నామీద పగబట్టినట్లున్నాడు. ఓట్లు కొనడం పెద్ద నేరమా, కేసీఆర్ ఏమన్నా కొనకుండా ఓట్లు వచ్చాయా? నామీద కేసు పెట్టాలంటాడు అని వాపోయాడు. జేసీ దివాకర్‌రెడ్డి వెంటనే... నిర్మొహమాటంగా చెబు తాను వినండి... మనం నేరుగా కేంద్రాన్నే అడుగుదాం, అది ఏ ఎలక్షన్ అయినా ఓట్ల కొనుగోలుకు చట్టబద్ధత కల్పించమని, అయినా ఈ రోజుల్లో ఓట్లు కొనని పార్టీ ఏది? ఓట్లు కొనకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిన వాళ్లెవరు? అయినా మీకు ఓట్లు కొనడం కూడా చేతకాలేదు, కాంగ్రెస్ వాళ్లకున్న ఎక్స్‌పీరియన్స్ మీకు లేదు. ఓట్లను కొనాలన్నా, దేశాన్ని అమ్మేయాలన్నా వాళ్లకు వాళ్లే సాటి! మీ చేతగాని తనం వల్లే ఈ సమస్యలన్నీ వచ్చాయి. అదేమంటే రూపాయికి కిలో బియ్యం, చంద్రన్న సరుకులు అంటారు. నేను తాగే సిగరెట్టే 11రూపాయలు, రూపాయికి చాక్లెట్ కూడా రావడం లేదు. మీరేదో పెద్ద మేధావి అనుకున్నాను, కాని మీ వద్ద అంత తెలివితేటలు కనిపించడం లేదని చంద్రబాబును దెప్పిపొడిచాడు. బాబుకు చిర్రెత్తి.. దివాకరా... రోడ్డుపై వున్న గాజు పెంకులను ఫ్యాంటుజేబులో వేసుకున్నట్లుగా వుంది నిన్ను పార్టీలో చేర్చుకున్నప్పటి నుండి నా పరిస్థితి. నువ్వు నన్ను పొగుడుతున్నావో, తిడుతున్నావో అర్ధంకాకఛస్తున్నా, నువ్వు మాట్లాడడంకంటే కూడా మాట్లాడకుండా ఉంటేనే నాకు కొంచెం ప్రశాంతంగా ఉంటుందన్నాడు. వెంటనే దేవినేని ఉమ ఉండి... ఆ కేసీఆర్ నోటివల్ల మీరేకాదు సార్ నేను కూడా ఇబ్బంది పడుతున్నాను. మొన్న ఒకచోట నన్ను ఉద్దేశించి "ఉమ అంటే ఆడోళ్లా? మగోళ్లా? అన్నాడట", ఇతని నోటికి ప్లాస్టర్ వేయాలని కసిగా అన్నాడు. కేసీఆర్ నోరు మూయించాలంటే మనమూ అతనిలాగే నోరు పారేసుకోవాలని అచ్చన్నాయుడు సూచించారు. పత్తిపాటి పుల్లారావు వుండి... సార్, వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి, ముల్లును ముల్లుతోనే తీయాలి. కాబట్టి కేసీఆర్‌ను కూడా మన నోటి పొగరుతోనే కంట్రోల్ చేయాలని చెప్పాడు. దాంతో అందరూ కలిసి అప్పటికప్పుడు ఎన్టీఆర్‌భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టారు. అందరూ కూర్చున్నారు. యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ... నువ్వు మగాడివైతే మా చంద్రబాబును అరెస్ట్ చెయ్... అదే నీకు ఆఖరి రోజు అవుతుందన్నాడు. కె.ఇ.కృష్ణమూర్తి అందుకుని... కేసీఆర్, హైదరాబాద్‌లో కాదు మా సీమ సందుల్లోకి రా.. చూసుకుందాం... మీ ప్రతాపము, మా ప్రతాపము అని సవాల్ విసిరాడు. అచ్చెన్నాయుడు అందుకుని... మా చంద్రబాబును టచ్ చేసి చూడు... కరెంట్ షాక్ కొట్టిన కాకిలా గిలగిల తన్నుకుంటా వన్నాడు. పి.నారాయణ మాట్లాడుతూ... కేసీఆర్, నువ్వు అరిస్తే అరుపులే, నేను అరిస్తే ఉరుములొస్తాయి. "మమ్మల్ని ఒకవైపే చూడు, రెండోవైపు చూడాలను కోవద్దు, మాడి మసైపోతావ్" అని అరి చాడు. చివరగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంతు వచ్చింది. నారాయణ కన్నా ఇంకా బలమైన పంచ్ డైలాగ్ వదలాలను కున్నాడు. నేను గట్టిగా తొడ కొట్టానంటే ఆ సౌండ్‌కే గుండె పోటొచ్చి సిమ్స్ ఆసుపత్రిలో పడిపోతావు... అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి డైలాగ్ వదిలాడు.

ఇక్కడితో ప్రెస్‌మీట్ ముగిసింది. పక్కగదిలో వుండి సిసి కెమెరాల ద్వారా ఈ ప్రెస్‌మీట్‌నంతా చూసిన చంద్రబాబులో ఎక్కడలేని ధైర్యమొచ్చింది. అంతలో అందరూ ప్రెస్‌మీట్ ముగించుకుని ఆయన గదిలోకే వచ్చారు. సోమిరెడ్డి వుండి... సార్, మా ప్రెస్‌మీట్ ఇప్పుడు అన్ని టీవీ ఛానెల్స్‌లోనూ వస్తుంది. మా డైలాగ్‌లు విని ఆ కేసీఆర్ ఫ్యాంటు తడుపుకోవడం ఖాయం. ఇక మీజోలికి రాడు. తన తప్పును క్షమించమని కేసీఆర్ మీ కాళ్ల మీద పడే అవకాశాలున్నాయని భరోసా ఇచ్చాడు. దాంతో చంద్రబాబు గుండెల నిండా ధైర్యం నింపుకుని ఇంటి కెళ్లాడు. రాత్రి రెండు పుల్కాలు తిని, తన మంత్రులు చెప్పిన మాటలను గుర్తుచేసుకుంటూ మంచం మీద వాలిపోయి నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

తెల్లారింది. చంద్రబాబు లేచి హాల్లోకి వచ్చాడు. అప్పటికే అక్కడ భువనేశ్వరీదేవి టీవీ ఆన్‌చేసి 10.5ఛానెల్‌లో వార్తలు చూస్తోంది. ఉన్నట్లుండి టీవీ స్క్రీన్ మీద అన్నాహజారే కనిపించసాగాడు. ఆయన కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. అన్ని టీవీలవాళ్లు ఆయన నోటిదగ్గర మైకులు పెట్టడానికి పోటీ పడుతూ ఆయన మూతి పగలగొట్టారు. అయినా ఆయన శాంతంగా మాట్లాడుతూ... ఈ కేసీఆర్ మనిషా, ఇంకేమన్నానా, నేను ఆలిండియా హజారేను అయితే, చంద్రబాబు ఆంధ్రా హజారే... ఈ దేశ రాజకీయాల్లో నా వారసుడెవరన్నా ఉన్నారంటే అది చంద్రబాబే. ఈ లోకంలో ధర్మం, నీతి అనేవి ఎక్కడున్నాయో చూపించమని అడిగితే నేను చంద్రబాబునే చూపిస్తాను, అలాంటి చంద్రబాబు మీదే కేసీఆర్ కేసు పెడతానంటాడా? చంద్రబాబు మీద కేసు గాని పెడితే నేను మళ్లీ ఉద్యమం చేపడతానని హెచ్చరించాడు. అన్నాహజారే లాంటి వ్యక్తి తన పట్ల చూపిన అభిమానానికి చంద్రబాబు కళ్లల్లో కూడా నీళ్లు తిరిగాయి. అంతలో అదే టీవీలో అమిత్‌షా కనిపించాడు. ఆయన మాట్లాడుతూ... మంచి వాడిని ఎవరైనా చెడ్డవాడంటే... మనం నమ్ముతామా? అందులోనూ చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడంటే నమ్ముతామా? నీతికి కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు, ఆయన జోలికిపోతే కేసీఆర్‌పై కఠినచర్యలు తప్పవ్ అంటూ హెచ్చరించాడు. అంతలో చంద్రబాబు పిఎస్ లోపలకు వచ్చి... సార్, మిమ్మల్ని కలవడానికి కేసీఆర్‌గారొచ్చారు అని చెప్పాడు. కేసీఆర్ పేరు వినగానే చంద్రబాబులో ఆందోళన కలిగింది. ఇప్పటిదాకా టీవీలలో తిట్టాడు, ఇప్పుడు ముఖాన్నే తిట్టడానికొచ్చినట్లున్నాడు. అయినా ఇంటికి వచ్చినవారిని రావద్దనడం సభ్యత కాదు అనుకుంటూ భయపడుతూనే లోపలకు రమ్మన్నాడు. కేసీఆర్ లోపలకు వచ్చాడు. రావడంతోటే చంద్రబాబు కాళ్లను పట్టుకుని నన్ను క్షమించన్నా, ఓటుకు నోటు కేసులో మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. నోటికొచ్చినట్లు తిట్టాను... అని బాధపడ సాగాడు. ఆకాశంలో మెరుపులు, మనిషన్నాకా అరుపులు కామనే కేసీఆర్... నిన్ను క్షమిస్తున్నా, ఇక వదులు, కేసీఆర్ ఇక వదులు... అని అనసాగాడు. కేసీఆర్ ఇంకా గట్టిగా పట్టుకోవడంతో... కేసీఆర్ ఇక వదులు అంటూ చంద్రబాబు గట్టిగా అరిచాడు. ఆ అరుపుకు ఆయన మంచం మీదే వున్న భువనేశ్వరీదేవి ఉలిక్కిపడి లేచింది. 'కేసీఆర్ వదులు' అంటూ చంద్రబాబు ఇంకా అరుస్తూనే వున్నాడు. వెంటనే భువనేశ్వరిదేవి... ఈయనకు ఆ కేసీఆర్ అరెస్ట్ చేసినట్లు కలొచ్చినట్లుంది... వదులు వదులూ అంటున్నాడు. ఎమ్మెల్యేలను కొనడం చేతకానప్పుడు ఆ పని చేయడ మెందుకు, సమస్యలు కొనితెచ్చుకోవడమెం దుకు అనుకుంటూ చంద్రబాబును గట్టిగా తట్టింది. చంద్రబాబు లేచి... కేసీఆర్ ఏడి... నా కాళ్లు పట్టుకుని వదల్లేదు, ఎక్కడికి పోయాడు అని అడిగాడు. కేసీఆరా... పాడా, మీరేదో కలగన్నట్లున్నారు అని అంది. అప్పుడు చంద్రబాబు కల నుండి ఈ లోకంలోకి వచ్చాడు. అప్పటిదాకా జరిగిందంతా కల అని తెలుసుకుని కల నిజమైతే ఎంత బాగుండో అనుకుంటూ మళ్లీ పడుకున్నాడు.

# కళ్యాణ వైభవం...!







నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో మరచిపోలేని నాయకుడు, మాజీమంత్రి దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మనుమడు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి – గీతల కుమారుడు **రజత్‌రెడ్డి - పూజారెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు కందాడ సంజీవరెడ్డి – మమతల కుమార్తె)ల వివాహం ఈ నెల 12వ తేదీ హైదరాబాద్‌లోని హైటెక్స్ హాల్లో, ఈ నెల 14వ తేదీ రిసెప్షన్ మాదాపూర్‌లోని సైబర్‌సిటీ కన్వెన్షన్ సెంటర్‌లోనూ ఘనంగా జరిగాయి. ఈ వివాహవేడుకలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య, ఒంగోలు పార్లమెంటు సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త జి.వి.కె.రెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డిలతో పాటు పలువురు తెలంగాణ, ఆంధ్రా మంత్రులు, ఎమ్మెల్యేలు, అన్ని వర్గాల ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన దంపతులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' అభినందనలు.



## కావలి కబుర్లు

# ఎల్లప్పుడూ పేదల సేవలోనే ఉంటా

**- డా॥ యన్.ప్రభాకర్‌నాయుడు**



పేద ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం అందుబాటులో ఉండి వారికి వైద్యసేవలందిస్తానని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు, ప్రజావైద్యులు, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ డా॥ నీలిశెట్టి ప్రభాకర్‌నాయుడు అన్నారు. సోమవారం ఆయన జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక ఏబిఎం కాంపౌండ్‌లోని గుండెమడుగుల దేవదానం మెమోరియల్ ఆసుపత్రి నందు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో చెన్నై, నెల్లూరు సింహపురి హాస్పిటల్‌కు చెందిన సూపర్‌స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత శిబిరంలో సుమారు 1500మంది వరకు వైద్యసేవలను పొందారు. ఈ కార్యక్రమంలో సుమారు 3,200రూపాయల విలువైన కార్డియాక్ ప్యాకేజ్(గుండెపరీక్షలు) ఉచితంగా నిర్వహించడం పేదలకు ఎంతో ఉపయోగపడింది. ఈ సందర్భంగా డా॥ ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ఇంతమంది పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలనందించటం సంతృప్తి కలిగించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుండి పట్టణంలోని డాక్టర్లు, ప్రముఖులు ఆయనను కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఈ వైద్యశిబిరానికి సీనియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డా॥ భక్తవత్సలరెడ్డి, డా॥ భాస్కర్‌రెడ్డిలు గుండె సంబంధ వ్యాధులకు వైద్యసేవలు అందించారు. ఇంకా ప్రముఖ డాక్టర్లు భరత్‌కుమార్, డా॥ లక్ష్మీరమేష్, ప్రముఖ ఎముకల వైద్యనిపుణులు డా॥ ఎన్.శివకుమార్, ఎన్.శ్రీకాంత్, డా॥ లక్ష్మీశాలనీలు పాల్గొన్నారు.

## కావలిలో సంబరాలు

శాసనమండలి సభ్యునిగా జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో గురువారం కావలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రవిచంద్ర నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు పోతుందని, ఎమ్మెల్సీగా ఆయన సేవలు కావలి నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు.

# బాగుపడుతున్న ట్రంకురోడ్డు



కావలి ట్రంకురోడ్డు విస్తరణ పనులలో పేద, ధనిక, రాజకీయ నాయకులకు సమ న్యాయం పాటించి ఆక్రమణలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. కావలి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో ట్రంకురోడ్డు ఆక్రమణల తొలగింపు పనులను టౌన్‌ప్లానింగ్ అధికారి దశయ్య ఇతర సిబ్బందితో చేపట్టారు. అయితే ఈ తొలగింపు పనుల్లో కొన్ని చోట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, గతంలో కూడా ఆక్రమణల తొలగింపు చేపట్టినప్పుడు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే తొలగించి వదిలేశారని, ప్రస్తుతం ఏ విధంగా చేస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆక్రమణలు తొలగిస్తామంటే అందరం సహకరిస్తామన్నారు. అలా కాకుండా ఏకపక్షంగా వ్యవహరించకూడదన్నారు. ట్రంకురోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయి పాదచారులు నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్లు అన్నీ జలమయమై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అదే సమయంలో మున్సిపల్ అధికారులకు పలువురు ట్రంకురోడ్డు సమస్యను వివరించారు. ముందునుండీ మున్సిపాలిటీలో డిఇగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు స్థానిక పరిస్థితులపై అవగాహన ఉండటంతో ప్రస్తుతం ఆయనే కమిషనర్ కావడంతో ట్రంకురోడ్డు ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. మొదట్లో ఆక్రమణల తొలగింపుపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తమైనా ఆక్రమణల తొలగింపు – దాని ఆవశ్యకతను ప్రజలకు వివరించి పనులు ప్రారంభించారు. ఈ పనుల్లో సిమెంటురోడ్డు నుండి మురికి కాలువ వరకు ఏ విధమైన ఆక్రమణలు లేకుండా, సిమెంటురోడ్డు నుండి వర్షపునీరు కాలువలోకి వెళ్ళేందుకు వీలుగా మారుస్తున్నారు. ఆక్రమణల తొలగింపులో ఎక్కడా వివాదాలు తలెత్తకుండా కమిషనర్ చాకచక్యంగా వ్యవహరిస్తూ ముందుకు వెళుతున్నారు. మిగిలిన ప్రాంతంలో కూడా తొలగింపు ఇదే విధంగా జరిగేందుకు స్థానిక రాజకీయ నాయకులు సహరిస్తారా? లేదా అన్నది వేచి చూడాల్సివుంది.

# నల్లబెల్లం లారీల పట్టివేత



చిత్తూరుజిల్లా నుండి ప్రకాశం జిల్లా వైపు అక్రమంగా తరలిస్తున్న 4నల్ల బెల్లం లారీలను కావలి వాణిజ్య విభాగం అధికారిణి సురేఖారెడ్డి, ఎక్సైజ్ సిఐ రామారావులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ప్రతి నెలా హైవే తనిఖీలలో భాగంగా కావలి వాణిజ్య విభాగం అధికారిణి సురేఖారెడ్డి ముసునూరు సమీపంలోని టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అనుమానాస్పదంగా వస్తున్న రెండు లారీలను గుర్తించి విచారించగా అందులో నల్లబెల్లం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆమె కావలి ఎక్సైజ్ సిఐ రామారావుకు సమాచారం అందిస్తూ ఆయనతో పాటు ఎక్సైజ్ శాఖ రాష్ట్ర అధికారి డైరెక్టర్ ఇ.దామోదర్‌నాయుడుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిఐ రామారావు, ఏఇఎస్ రవికుమార్‌రెడ్డి, సిబ్బందితో టోల్‌ప్లాజా వద్దకు వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు సాగించగా మరో రెండు నల్లబెల్లం లారీలు పట్టుబడ్డాయి. పట్టుబడ్డ లారీ డ్రైవర్లను విచారించగా మరొక లారీ ముందుగానే వెళ్లినట్లు సమాచారం. అయితే ఆ లారీలు ఎక్కడికి వెళుతున్నాయో ఖచ్చితమైన సమాచారం చెప్పాలని కావలి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఎక్సైజ్ రాష్ట్ర డైరెక్టర్ దామోదర్‌నాయుడు ఆదేశాల మేరకు 4లారీల డ్రైవర్లను వాటి తాలూకు బిల్లులను పరిశీలించారు. విచారణలో రెండు లారీలు సక్రమమైన పద్ధతిలో అన్ని ఆధారాలు కలిగి ఉండటంతో వాటిని విడుదల చేశారు. మిగిలిన రెండు లారీలకు ట్రాన్స్‌పోర్టు పర్మిట్స్ లేకపోవడం, వీరు సరఫరా చేసే నల్లబెల్లం సారా కాసేందుకు క్రిష్ణా, తూ.గోదావరి జిల్లాలకు వెళుతున్నట్లు గుర్తించి అందులోని సుమారు 7లక్షల విలువైన నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్లను అరెస్టు చేశారు. వీటిపై కేసు నమోదు చేసి మిగిలిన సమాచారం కోసం దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామారావు తెలిపారు.

# నెల్లూరులో మల్టీ ఇండోర్ స్టేడియం

- మాగుంట లేఅవుట్‌లో నిర్మాణానికి ఏర్పాట్లు
- వెంకయ్యనాయుడు చొరవతో నిధుల మంజూరు

కేంద్రప్రభుత్వం దాదాపు రూ. 6కోట్ల నిధులతో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో మల్టీ ఇండోర్ స్టేడియంను నిర్మించనుంది. ఇందుకోసం అయిదున్నర ఎకరాల ఖాళీ స్థలాన్ని నగరపాలక సంస్థ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు అప్పగించింది. ఈ మల్టీ ఇండోర్ స్టేడియంలో వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, షటిల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, యోగా తదితర క్రీడలను ప్రత్యేకంగా రూపుదిద్దనున్నారు. స్టేడియం కింద నేలను ప్రత్యేకమైన చెక్కతో క్రీడాకారులకు అనుకూలంగా వుండేలా నిర్మించనున్నారు. ఈమేరకు జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ అధికారులు ప్రతిపాదనలు పంపగా కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చొరవతో నిధులు మంజూరైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ క్రీడా మైదానాన్ని పరిశీలించేందుకు వారంరోజుల్లో కేంద్రం నుంచి ప్రత్యేకబృందం రానుంది. ఇప్పటికే జేసీబీలతో భూమిని చదును చేసే పనులు మొదలయ్యాయి.

# మసీదులను పరిశీలించిన మేయర్

రంజాన్ పండుగ మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని అన్ని మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ కోరారు. మంగళవారం పలు మసీదులను ఆయన పరిశీలించారు. ముస్లిం మతపెద్దలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముస్లింలు పవిత్రంగా జరుపుకునే రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటారని, అందుకు తగ్గట్టు మసీదుల వద్ద తాగునీరు, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్యం సరిగా ఉండాలని అధికారులకు సూచించారు. నగరంలోని 41, 42, 43, 44వ డివిజన్లలోని మసీదులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కార్పొరేటర్లు నూనె మల్లికార్జునయాదవ్, బాలకోటేశ్వరరావు, మామిదాల మధు, టిడిపి మైనార్టీ జిల్లా అధ్యక్షులు మున్వర్ బాషా, మైనారిటీ నాయకులు హయత్, జాఫర్ మొహిద్దీన్, నగరపాలక సంస్థ ఎస్ఇ ఇమాముద్దీన్, ఎంహెచ్ఓ వెంకటరమణయ్య, శానిటరీ సూపర్‌వైజర్ శివనాగేశ్వరరావు, నాయకులు జహీర్, ప్రసాద్, మాదాల వెంకటేశ్వర్లు, సూరిబాబు, డిఇ, ఏఇలు పాల్గొన్నారు.

# నెల్లూరు రచయితకు ప్రగతి రత్న పురస్కారం



నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, రచయిత, కవి కె.వి.నాగేశ్వరరావు తెలుగు సాహిత్య రంగానికి విశేష సేవలందించినందుకు గాను చిత్తూరు జిల్లా తెలుగు భాషాపరిరక్షణ సమితి సంస్థ ఆయనకు 'తెలుగు వాఙ్మయ ప్రగతి రత్న' విశిష్ట పురస్కారం అందజేసింది. ఈ అరుదైన అవార్డును ఈనెల 13వ తేదీన తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో నిర్వహించిన సభలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, తిరుపతి శాసన సభ్యులు శ్రీమతి జి.సుగుణమ్మ సంస్థ అధ్యక్షులు త్రాళంబేడు సాయి శంకరరెడ్డి తదితరులు నాగేశ్వరరావుకు అందజేశారు.

# తేనెటీగలకు కోపం వచ్చింది

తేనెతుట్టెపై ఆకతాయిలు రాళ్లు విసరడంతో తేనెటీగలకు కోపం వచ్చింది. దీంతో ఒక్కసారిగా విజృంభించాయి. ఎంసెట్ కౌన్సిలింగ్ కేంద్రంపై దాడి చేసాయి. ఈ సంఘటన 13వ తేదీ నెల్లూరు వెంకటేశ్వరపురంలోని బాలుర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగింది. ఎంసెట్ ఇంజనీరింగ్ విభాగంలో అర్హత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ జరుగుతుండగా తేనెటీగలు దాడి చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు పరుగులు తీసారు. దాడి నుంచి తప్పించుకునేందుకు పుస్తకాలు క్యారీ బాగ్‌లు, గోతాలు ముఖానికి అడ్డుపెట్టుకుని పరుగులు తీసారు. వెంటనే కౌన్సిలింగ్ హాలు కిటికీలు, తలుపులు మూసివేసి కౌన్సిలింగ్ కొనసాగించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండడం వల్ల ఎవరికీ అపాయం కలగకుండా బయటపడ్డారు.

# సేవకుల సత్తా జిల్లా మహిళా అధ్యక్షురాలుగా విద్యుల్లత



ప్రజాసత్తా చర్చిపాస్టర్ల సంక్షేమ విభాగం సేవకుల సత్తా(పాస్టర్స్ పవర్) జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కుమారి చెంతాటి విద్యుల్లత(46)ను ప్రజాసత్తా గ్రూప్స్ వ్యవస్థాపక అధ్యక్షులు పులగర శోభన్‌బాబు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని మహిళా పాస్టర్ల సంక్షేమమే లక్ష్యంగా మహిళా పాస్టర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా సేవకుల సత్తా మహిళా విభాగం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# మేలిమి స్వర్ణం లాంటి నాయకుడు వేమయ్య



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీఎమ్మెల్యే స్వర్ణ వేమయ్య 20వ వర్ధంతిని ఈ నెల 16వ తేదీన నెల్లూరు రూరల్ పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి సమాజమందిరంలో నిర్వహించారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు శ్రీమతి గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆర్ఎంఒ డాక్టర్ విజయ గౌరి, డాక్టర్ దేవసేన, ఎస్.గంగాధర్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, స్వచ్ఛంధ సంస్థల జిల్లా అధ్యక్షుడు ఇవివిఎస్ నాయుడు, వొమ్మిన సుబ్రహ్మణ్యం, రక్తదాత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, సిపిఎం నారాయణ, దూదల వెంకయ్య, శ్రీమతి కుసుమకుమారి, గున్నం పెదవెంగళరెడ్డి తదితరులు పాల్గొని సమాజానికి స్వర్ణ వేమయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ తరం నాయకులు స్వర్ణ వేమయ్యను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని, ఆయన సేవాభిలాషను అనుసరించి, ప్రజాసేవకు అంకితం కావాలని వక్తలు కోరారు. ఈ సందర్భంగా పేద మహిళలు, వికలాంగులు, ప్రతిభావంతులైన విద్యార్థులకు కుట్టుమిషన్లు, చీరలు, నిత్యావసర వస్తువులు, నగదు బహుమతులు అందజేశారు. అందరికీ అన్న సంతర్పణ నిర్వహించారు.

# రెడ్‌క్రాస్ ప్రతిష్టను పెంచండి



ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్‌ను అవినీతిపరుల నుండి కాపాడాలని, దాని అనుబంధ విభాగాలను ప్రక్షాళన చేసి రెడ్‌క్రాస్ ప్రతిష్టను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ముక్కెన అంకయ్యచౌదరి జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం నిర్వహించబోతున్న ఎన్నికల్లో పాత కమిటీలో కీలకపదవులు నిర్వహించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించాలని జేసీని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జీవితసభ్యులు ఎం.కొండారెడ్డి, పి.వి.వీరభద్రం, షేక్ సందాని బాషా, పౌరహక్కుల సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్లైమాక్స్‌లో కాసుల కేసు

(మొదటిపేజీ తరువాయి)

20మందిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే సండ్ర వీరయ్యకు, ఎమ్మెల్సీ అభ్యర్థి వేం నరేంద్ర రెడ్డికి నోటీసు జారీ చేసారు.

ఈ కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేస్తారనే ఊహాగానాలు సైతం బలంగా వున్నాయి. స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. అయితే ఆ మాటల్లో డబ్బు ప్రస్తావన రాలేదు. చంద్రబాబు అరెస్ట్‌కు ఫోన్ సంభాషణ సరిపోదు. అయితే ఇంతకు మించిన బలమైన ఆధారాలు తెలంగాణ ఏసిబి అధికారులకు లభించాయనే సమాచారం ముంది. చంద్రబాబు పాత్ర ఉంటే అరెస్ట్ చేసే విషయంపై కూడా తెలంగాణ సీఎం కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌తో చర్చించినట్లుగా తెలుస్తోంది. చంద్రబాబు అరెస్ట్‌కు కోర్టు ఆదేశిస్తే గవర్నర్ కూడా అడ్డుపడే అవకాశాలు లేవు.

**కేంద్రం ప్రేక్షక పాత్ర:** ఓటు – నోటు కేసులో కేంద్రం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. ఈ కేసు నుండి ఎలాగైనా చంద్రబాబును గట్టెక్కించాలన్నంత అభిమానం బీజేపీ నాయకులకు లేదు. ఈ కేసులో జోక్యం చేసుకుంటే ఆ బురద కొంచెం బీజేపీకి కూడా అంటుకుంటుంది. ఇప్పటికే లలిత్‌మోడీ వివాదంతో ఆ పార్టీ సతమతమవుతోంది. కాబట్టి చంద్రబాబును రక్షించే ప్రయత్నం చేయకపోవచ్చు. అదీగాక కేసీఆర్‌తో శత్రుత్వం ఆ పార్టీ అధిష్టానం కోరుకోవడం లేదు. కాబట్టి చంద్రబాబు స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకోక తప్పదు.

**యుద్ధ వాతావరణం:** విభజన జరిగాక నీళ్ల వద్దో, కరెంట్ వద్దో ఇరు రాష్ట్రాల ప్రజలు తన్నుకునే పరిస్థితి వస్తుందని అందరూ వూహించారు. కాని వాటికంటే ముందు ముఖ్యమంత్రులే తన్నుకునే పరిస్థితులు వచ్చాయి. హైదరాబాద్ నుండి చంద్రబాబును వెళ్లగొట్టాలనే కేసీఆర్ పట్టుదలకు ఈ కేసు మరింత బలంగా తోడయ్యింది. ఏ క్షణంలోనైనా తనను అరెస్ట్ చేయొచ్చనే భయం చంద్రబాబుకు కూడా పట్టుకుంది. అందుకే తనకు రక్షణగా తెలంగాణ పోలీసులను తీసేసి ఆంధ్రా పోలీసులను పెట్టుకున్నాడు. హైదరాబాద్‌లో తన సచివాలయం, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వద్ద ఆంధ్రా పోలీసు బందోబస్తును పెంచాడు. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్లు కేసీఆర్‌పై ఏపిలో కేసులు పెట్టించారు.

**స్థానికతే బలం:** ఎవరికైనా స్థానిక బిర్రు ముఖ్యం. ఏపి రాజధాని విజయవాడలోనో, గుంటూరులోనో ఉండి, చంద్రబాబు ఇక్కడనుండే పరిపాలన చేస్తుండుంటే ఈ కేసు గురించి భయపడాల్సిందేమీ లేదు. తెలంగాణ పోలీసులు ఇక్కడకొచ్చి చంద్రబాబును తీసుకుపోయేదేమీ వుండదు. ఆయనకు హైదరాబాద్‌ను వదలాలనిపించడం లేదు. కాని అక్కడ చూస్తే కేసీఆరే స్థానికంగా బలవంతుడు. హైదరాబాద్ పేరుకు ఉమ్మడి రాజధానే కాని, కేసీఆర్‌కు వున్న అధికారాలు, ఆయనకున్న స్థానిక బలం చంద్రబాబుకు ఎక్కడొస్తుంది. ఆ స్థానిక బిర్రుతోనే కేసీఆర్ ఒకప్పుడు తన బాస్ అయిన చంద్రబాబుకే చెమటలు పట్టిస్తున్నాడు.

**ప్రాంతీయ విద్వేషాలు:** ఓటు – 5కోట్లు కేసు పూర్తిగా రాజకీయ పరమైంది. తెలంగాణలో బలపడాలని చంద్రబాబు, తెలంగాణ నుండి ఈయనను తరిమేయాలని కేసీఆర్‌లు ఆడుతున్న ఆటలో ఇదో భాగం. ఇరు రాష్ట్రాల ప్రజలకు దీంతో ఏ సంబంధమూ లేదు. కాని తెలంగాణలోకంటే ఎక్కువగా ఆంధ్రాలోనే దీనిని ఇరు రాష్ట్రాల వివాదంగా మార్చే ప్రయత్నం జరగడం చూస్తున్నాం. చంద్రబాబు అధికారులను, పోలీసులను రెచ్చగొడుతున్నారు. తెలంగాణ పోలీసులను మన రాష్ట్ర పోలీసుల చేత అడ్డుకోవాలనుకుంటున్నాడు. అదే జరిగితే ఇరు రాష్ట్రాల పోలీసుల మధ్య ఘర్షణ రేగి, అది ఇరు రాష్ట్రాలలో వున్న ప్రజలకు కూడా పాకుతుంది. అప్పుడన్నా కేంద్రం జోక్యం చేసుకుని కేసీఆర్‌ను కట్టడి చేస్తుందని చంద్రబాబు ఆశ.

ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే చంద్రబాబును జైలుకు పంపించే దాకా కేసీఆర్ నిద్ర పోయేటట్లు లేదు. చంద్రబాబును అరెస్ట్ చేస్తే తదుపరి సీఎం ఎవరు? అనేదానిపై కూడా పార్టీలో రసవత్తరంగా చర్చ జరుగుతోంది. అనుకోని పరిస్థితుల్లో చంద్రబాబు సీఎం పదవి నుండి దిగాల్సి వస్తే తెలుగుదేశంపార్టీకి కష్టాలు మొదలైనట్లే!

# ఆ ఇద్దరు

(మొదటిపేజీ తరువాయి)

ఒకే జిల్లా నుండి ఒకేసారి ఇద్దరికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం రావడం చాలా అరుదు. సోమిరెడ్డి, బీదలకు ఆ అవకాశం వచ్చింది. ఎమ్మెల్యేగా, మంత్రిగా సోమిరెడ్డికి ఎంతో అనుభవం వుంది. ఆ అనుభవం శాసనమండలిలో ప్రభుత్వానికి ఖచ్చితంగా ఉపయోగపడుతుంది. చట్టసభలకు రవిచంద్ర కొత్త. కాబట్టి అనుభవం తెచ్చుకోవడానికి, ఇంకా కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆయనకు ఈ పదవి ఉపయోగపడుతుంది. ఎమ్మెల్సీలుగా బాధ్యతలు చేపట్టిన రవిచంద్రమోహనులకు అభినందనలు.

# విఆర్‌పై సర్కార్ కన్ను




**విఆర్ విద్యాసంస్థల ఆస్తుల వివరాలను సేకరించిన దేవాదాయశాఖ**

**కాలేజీ ముందు అన్యమత విగ్రహాల ఏర్పాటుతో రంగంలోకి దిగిన ప్రభుత్వం**



*వి.ఆర్ విద్యాసంస్థలు... వెంకటగిరి రాజా పేరుతో వెలిసినవి. కాని ఈ తరంలో చాలామంది విఆర్ అంటే వివేకానందరెడ్డి విద్యాసంస్థలని అనుకుంటుంటారు. ఆ విద్యాసంస్థల మీద ఆనం వివేకానందరెడ్డి బ్రాండ్ అంతగా వుంది మరి. గత కొన్ని దశాబ్దాలుగా విఆర్ విద్యాసంస్థలు ఆనం కుటుంబసభ్యుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. కాబట్టి ఈ విద్యాసంస్థలలో వారి ప్రమేయం లేకుండా ఏ పనీ జరగని పరిస్థితి.*

ఒకప్పుడు ఈ విద్యాసంస్థలు ఎస్‌వి యూనివర్శిటీ పరిధిలో ఉండేవి. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల్లూరులోనే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో ఈ యూనివర్శిటీ క్రిందకు వచ్చాయి. 135ఏళ్ల క్రితం బ్రిటీష్ వారి హయాంలో వెంకటగిరి రాజాలు ప్రత్యేకంగా హిందువుల కోసమే ఈ విద్యాసంస్థను నెలకొల్పారు. కాలక్రమంలో ఈ విద్యాసంస్థ ప్రాథమిక విద్య నుండి పీజీ కోర్సుల దాకా విస్తరించింది. ప్రాథమిక విద్య, ఉన్నత విద్య, ఇంటర్, డిగ్రీ, న్యాయవాద కోర్సులు, పిజి, వృత్తి విద్యాకోర్సులు, బిఇడి వంటి అన్ని కోర్సులను ఈ విద్యాసంస్థల్లో తెచ్చారు. దాదాపు 20ఏళ్ల క్రితం వరకు కూడా విఆర్ డిగ్రీ కాలేజీలో సీట్ల కోసం రెకమండేషన్‌లు చేయించుకునే వాళ్లు. జిల్లాలోని ఎయిడెడ్ కాలేజీలలో కావలి జవహర్‌భారతి తర్వాత మంచి పేరున్నది విఆర్ కళాశాలకే!

అయితే రాష్ట్రంలో కార్పొరేట్ చదువులమయమై, విద్యార్థులంతా ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల వైపు పరుగులు తీస్తుండడంతో విఆర్ విద్యాసంస్థలలోని ఇంటర్, డిగ్రీ, లా కోర్సులలో చేరే వాళ్లే కరువయ్యారు. దాంతో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలలాగే విఆర్ విద్యాసంస్థలు కూడా మూతపడే దశకు వచ్చాయి. గత వైభవానికి ఆనవాళ్లుగా మిగిలిపోబోతున్నాయి.

కాగా విఆర్ విద్యాసంస్థలను దేవాదాయశాఖ పరిధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. దీనికి కారణం మత పరమైన వివాదాలేనని తెలుస్తోంది. మన ప్రభుత్వ విద్యాసంస్థల్లోగాని ప్రైవేట్ విద్యాలయాల్లోగాని సరస్వతీ విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. క్లాసుల ప్రారంభానికి ముందు అక్కడ విద్యార్థులు ప్రార్థన చేస్తుంటారు. మిషనరీ స్కూళ్లలో అయితే మేరి మాత, జీసెస్ విగ్రహాలుంటాయి. అసలు ఏ సమస్యా ఉండకూడదనుకుంటే ఎవరి విగ్రహాలూ పెట్టరు. కానీ విఆర్ విద్యాసంస్థల ముందు జీసెస్ విగ్రహాలు పెట్టడం వల్లే వివాదం రాజుకుంది. పాత ఫైళ్లను దుమ్ము దులిపి ఈ విద్యాసంస్థలను దేవాదాయ శాఖ పరిధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వ పరంగా శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. విఆర్ విద్యాసంస్థలకు సంబంధించి వైఎంసిఏ గ్రౌండ్‌లో బిఇడి కాలేజీని నిర్మించడం తెలిసిందే! ఈ భవానానికి ముందు 2012లో విఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్‌గా వున్న ఆనం వివేకానందరెడ్డి బాలయేసు మందిరాన్ని నిర్మించాడు. దీనికి విఆర్ విద్యాసంస్థల ఖాతా నుండే 18 లక్షల దాకా ఖర్చు చేసినట్లు సమాచారం. అప్పుడే హిందూ సంస్థలు, ఏబివిపి, విహెచ్‌పి, బీజేపీలు దీనికి నిరసనగా ఆందోళనలు కూడా చేపట్టాయి. హిందువులకు సంబంధించిన విద్యాసంస్థల వద్ద అన్యమతానికి చెందిన విగ్రహాలేంటంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాయి. అయితే ఆ వివాదం అక్కడితో సర్దుమణిగినా వివేకానందరెడ్డి మాత్రం అక్కడితో ఆగలేదు. కొన్ని నెలల క్రితమే బాలయేసు మందిరం పక్కనే పొడుగాటి జీసెస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసారు. దీనికి వ్యతిరేకంగా హిందూ సంస్థలు ఆందోళనలు చేసినా వివేకా లెక్కచేయలేదు.

అయితే దీనికి వ్యతిరేకంగా కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసారు. సమాచార హక్కు చట్టం క్రింద దేవాదాయ శాఖకు అర్జీలు పెట్టారు. విఆర్ కాలేజీ, హైస్కూల్ కమిటీ దేవాదాయశాఖ చట్టం క్రింద 1987లోనే రిజిష్టర్ చేసినట్లు తెలిసింది. ప్రతి ఏటా 650రూపాయలను మేనేజ్‌మెంట్ ఫీజు క్రింద దేవాదాయశాఖకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో వున్న పలు సత్రాలు, దేవాలయాల మాదిరిగానే విఆర్ విద్యాసంస్థలు కూడా దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయని పలువురి వాదన.

విఆర్ విద్యాసంస్థలు పూర్తిగా హిందూ, మతం కోసమే పెట్టారు. అయితే ఈ విద్యాసంస్థల వద్ద అన్యమత విగ్రహాలను పెట్టడాన్ని హిందువులు జీర్ణించుకోలేకున్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో దాని మిత్రపక్షమైన టిడిపి ప్రభుత్వాలు ఉన్నాయి. బీజేపీ వాళ్లు దీనిపై గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. సర్వోదయ కళాశాల ఇప్పటికే ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లింది. బీజేపీ, తెలుగుదేశం నాయకుల ఒత్తిళ్ల మేరకు ప్రభుత్వం కూడా విఆర్ సంస్థలపై స్పందించింది. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ఓ బృందం ఇటీవలే విఆర్ విద్యాలయాలను పరిశీలించింది. సంస్థల ఆస్తులు, డిపాజిట్ల వివరాలను సేకరించింది. దీంతో విఆర్ విద్యాసంస్థలను దేవాదాయశాఖ స్వాధీనం చేసుకోవచ్చనే ప్రచారం ముమ్మరంగా వుంది.

కానీ, ఆనం సోదరుల పట్టు నుండి ఈ విద్యాసంస్థలను విడిపించడం అంత అలివయ్యే పనేనా? చూద్దాం... ఏం జరగబోతోందో?

## బాధితులకు న్యాయం చేయండి

**- పోలీసు అధికారుల సమావేశంలో జిల్లా ఎస్పీ**





పోలీసులు సమర్ధవంతంగా పనిచేయాలని, పోలీస్‌స్టేషన్లలోనే బాధితులకు న్యాయం జరగాలని, నిజమైన బాధితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా చూడాలని జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరులో జరిగిన నేరసమీక్షా సమావేశంలో ఆయన పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లలో న్యాయం జరగకపోవడం వల్లే జిల్లా పోలీస్ కార్యాలయానికి బాధితులు వస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా బాధితులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వుండవద్దని, చోరీలు, రౌడీయిజం, దాడులు తదితర కేసుల్లో అరెస్టులు త్వరితగతిన జరగాలని అన్నారు. దొంగలను పట్టుకోవడంతో పాటు, చోరీకి గురైన సొత్తును రికవరీ చేయాలని, పెండింగ్ కేసులపై దృష్టి సారించి త్వరితగతిన వాటిని పూర్తిచేయాలని అన్నారు. బాగా పనిచేస్తున్నవారిని ప్రోత్సహిస్తామని, పనిచేయనివారిపై చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పోలీసులందరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రెడ్డి గంగాధరరావుతో పాటు జిల్లాకు సంబంధించిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com